

శ్రీకాళహస్తికి ఉత్సవ కళ





భక్త కన్నప్ప

●ముక్కంటి శివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



ముక్కంటి ఆభరణాలు

శ్రీకాళహస్తి, మార్చి 2: భవుడి మహా శివరాత్రి ఉత్సవాలకు శ్రీకాళహస్తి సర్వాంగసుందరంగా ముస్తాబైంది. ముక్కంటి ఆలయాన్ని ముచ్చటైన రంగవల్లులతో తీర్చిదిద్దారు. గోపురాలు కొత్త రంగులతో కళకళలాడుతున్నాయి. భక్తకన్నప్ప, రామసేతు వంతెనల పైనా, పట్టణవ్యాప్తంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. అరటిచెట్లు, మామిడాకుల పచ్చతోరణాలు, కాషాయరంగు జెండాలతో వీధులు దర్శనమిస్తున్నాయి.భక్తుల కోసం ఆలయంలో చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. చతుర్మాడ వీధులు, సాంస్కృతిక కార్యక్రమాల వేదికైన ధూర్జటి కళా ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. సన్నిధివీధిలో ఏర్పాటు చేస్తున్న కైలాసం సెట్టింగ్ పనులు జోరందుకున్నాయి. రథాలు, నారద పుష్కరణిలోని తెప్పలను రంగులతో ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని బ్యాంకు లాకర్లో ఉన్న జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడి ఆభరణాలను శనివారం ముక్కంటి ఆలయానికి చేర్చారు. ఉత్సవాల్లో స్వామి, అమ్మవార్లు ఈ ఆభరణాలను ధరిస్తారు.




ఆలయంలో పూల అలంకరణలు

కన్నప్ప ధ్వజారోహణంతో నేడు ప్రారంభం

శ్రీకాళహస్తీశ్వరాలయ మహా శివరాత్రి ఉత్సవాలు ఆదివారం భక్తకన్నప్ప ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. పరమశివుడి వరంతో కన్నప్పగా మారిన తిన్నడికి కొండపై స్థానమిచ్చి, కిందిభాగంలో దేవదేవుడు కొలువైన పుణ్యక్షేత్రమిది. దీంతో భక్తుడు కన్నప్పకు తొలి పూజ చేసి ఉత్సవాలకు అంకురార్పణ చేయడం ఆనవాయితీగా వస్తోంది. 14 రోజులు జరిగే శివరాత్రి ఉత్సవాల్లో ప్రథమంగా కన్నప్ప ధ్వజారోహణం జరగనుంది. ఇందులో భాగంగా ఆదివారం ఆలయ అలంకార మండపం నుంచి భక్త కన్నప్ప ఉత్సవ మూర్తిని కొండపైకి ఊరేగింపుగా తీసుకువెళ్తారు. అక్కడ వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి, శాస్త్రోక్తంగా కన్నప్ప ధ్వజారోహణం మహోక్రతువును నిర్వహించి దేవతలకు ఆహ్వానం పలుకుతారు.

ఆకట్టుకుంటున్న విద్యుదలంకరణలు



కన్నప్ప ఆలయం

వైసీపీలో వర్గపోరు తారస్థాయికి

- పరస్పరం పోలీసులకు ఫిర్యాదులు
- ముఖ్య నేతలు సహా 8మందిపై అట్రాసిటీ కేసుల నమోదు
- నిందితుల్లో డీసీసీబీ ఛైర్మన్, ఎంపీపీ, సర్పంచ్ తదితరులు

పెళ్లకూరు, మార్చి 2: వైసీపీలో వర్గ పోరు తారస్థాయికి చేరుకుంది.ఓ వర్గం చేపట్టే అక్రమ గ్రావెల్ తవ్వకాలను మరో వర్గం అడ్డుకున్న క్రమంలో ఇరు వర్గాలూ దళితుల ద్వారా ఫిర్యాదులు చేయించాయి. రాజీ కుదిర్చేందుకు పార్టీ అగ్ర నేతలు చేసిన యత్నాలు ఫలించలేదు. దీంతో ఇరువర్గాలపైనా ఎస్సీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి పోలీసులు చేతులు దులుపుకున్నారు. పెళ్లకూరు మండలం బంగారంపేట చెరువు నుంచీ ఎమ్మెల్యే వర్గానికి చెందిన కొందరు నాయకులు గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు.గురువారం సాయంత్రం సూళ్ళూరుపేట పట్టణ వైసీపీ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి కొంతమంది అనుచరులతో కలసి చెరువు వద్దకు వెళ్లి తవ్వకాలను అడ్డుకున్నారు.ఆ మండలానికి చెందిన నెల్లూరు డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డికి ఈ విషయం తెలిసి పెద్దసంఖ్యలో అనుచరులతో అక్కడికి చేరుకుని శేఖర్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. సూళ్ళూరుపేట వైసీపీ నేతకు పెళ్ళకూరు మండలంలో ఏం పనంటూ ప్రశ్నించగడంతో పరస్పరం తోపులాడుకుని దుస్తులు కూడా చించుకున్నారు.ఇరు వర్గాలూ ఫిర్యాదు చేసినప్పటికీ శుక్రవారం మధ్యాహ్నం వరకు కేసులు నమోదు చేయకపోవడంతో నాయుడుపేట సర్కిల్ కార్యాలయం ఎదుట సత్యనారాయణరెడ్డి తన వర్గీయులతో ధర్నాకు దిగారు.ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి కళత్తూరు శేఖర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, నరేష్‌రెడ్డిలపై అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి.ఈ విషయం తెలుసుకున్న మరో వర్గం మోదుగుల పాలెం దళితకాలనీకి చెందిన ముత్యాలయ్యను కులం పేరుతో దూషించి దాడికి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నాయుడుపేట సర్కిల్ ఆఫీసుకు స్థానిక ఎస్‌ఐ శ్రీకాంత్‌ను పిలిపించుకుని డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, చిల్లకూరు సర్పంచు పగడాల హరిబాబురెడ్డి, అదే గ్రామానికి చెందిన పిల్లమిట్ట వంశీకృష్ణ, శిరసనంబేడు గ్రామానికి చెందిన గెడ్డాం వెంకటకృష్ణారెడ్డి, నెలబల్లి గ్రామానికి చెందిన ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డిలపై అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. వైసీపీకే చెందిన రెండు వర్గాల్లో ముఖ్య నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు కావడం అధికార పార్టీలో కలకలం రేపుతోంది.

సమన్వయ బాధ్యత ఎమ్మెల్యేదే

సూళ్లూరుపేట అసమ్మతి నేతల సమావేశంలో పెద్దిరెడ్డి

తప్పు చేసి వుంటే క్షమాపణలన్న ఎమ్మెల్యే కిలివేటి



అసమ్మతి నేతల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి

సూళ్లూరుపేట, మార్చి 2: సూళ్లూరుపేటలో మన పార్టీ పరిస్థితి బాగాలేదని అధ్యక్షుడు జగనే తనకు చెప్పారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి అన్నారు. శనివారం సూళ్లూరుపేటలో నియోజకవర్గంలోని వైసీపీ అసమ్మతి నేతలతో చెంగాళమ్మ ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే నడుమ సమన్వయం లేకపోవడంతో పార్టీకి గడ్డుకాలం వచ్చిందని,చక్కదిద్దమని చెప్పి తనను పంపారని ఆయన వివరించారు.చిన్నపాటి సమస్యలొచ్చినా అందరినీ సమన్వయం చేసుకొని ముందుకు సాగాల్సిన బాధ్యత ఎమ్మెల్యే సంజీవయ్యదేనని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ తాను ఎవరికీ అన్యాయం చేయలేదని, పార్టీ నాయకుల్లో ఒకరికి న్యాయం చేసే సమయంలో ఇంకొకరికి అన్యాయం జరిగి ఉండవచ్చన్నారు. అలాంటివి మరోసారి జరగవన్న ఆయన తప్పుచేసి ఉంటే క్షమించాలని కోరారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ గాలి వీస్తోందని సీఎం నుంచి సీనియర్ నాయకుల దాకా చెబుతున్నా పెద్దఎత్తున నాయకులు పార్టీని వదిలి వెళ్తున్నారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ఒంటెద్దు పోకడ, పార్టీ జెండాలు మోసిన వారిని విస్మరించడం వల్లే నేడు పార్టీకి ఈ దుస్థితి వచ్చిందన్నారు. మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి మాట్లాడుతూ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్న వారికి ప్రాధాన్యత లేకుండా పోయిందని, ఎమ్మెల్యే మౌనంగా ఉన్నప్పటికీ ఆయన వర్గీయులు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.గూడూరుకు చెందిన సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, కళత్తూరు శేఖర్ రెడ్డి, తంబిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, మధుసూదన రెడ్డి, కళత్తూరు సునీల్ రెడ్డి, మారబత్తిన సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో జడ్పీటీసీ మురళీధర రెడ్డి తదితరులు

జడ్పీటీసీకి లేని ప్రొటోకాల్

● వడమాలపేట వైసీపీ జడ్పీటీసీ మురళీధర రెడ్డి

మంత్రి రోజా అన్నకెవరు ఇచ్చారు?

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 2: జడ్పీటీసీలకు లేని ప్రొటోకాల్ మంత్రి రోజా అన్నకు ఎవరిచ్చారని వడమాల పేట జడ్పీటీసీ మురళీధర రెడ్డి ప్రశ్నించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల వడమాలపేటలో రూ.50లక్షల తుడా నిధులతో సీసీ డ్రెయిన్లు నిర్మించడానికి చేసిన భూమిపూజలో ఏ అధికారంతో రోజా అన్న రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. అన్నదమ్ములతో కలిసి నగరి నియోజకవర్గాన్ని రోజా దోచేస్తున్నారని ఆరోపించారు. తాను జిల్లా పరిషత్ సభ్యుడి హోదాలో గత నెల 25న అప్పలాయగుంటలో సచివాలయం, పత్తిపుత్తూరులో పాలశీతలీకరణ కేంద్రం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభిస్తే అవే భవనాలను శనివారం మంత్రి రోజా ప్రారంభించడమేంటన్నారు. ఏ ప్రజాప్రతినిధికీ ఇంతటి ఘోరావమానం జరక్కూడదన్న ఆయన అధికారులపై ప్రైవేటు కేసు వేస్తున్నానని స్పష్టం చేశారు. అప్పలాయగుంటలో ప్రజలెవరూ మంత్రి రోజా కార్యక్రమానికి రాకపోవడంతో అక్కడ రద్దు చేసుకుని పత్తిపుత్తూరులో పాలశీతలీకరణ కేంద్రాన్ని, సచివాలయాన్నీ తనకు సమాచారం ఇవ్వకుండా వలంటీర్లు, ప్రభుత్వ అధికారులతో ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే నగరి నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు, వైసీపీ క్యాడర్ రోజాపై అసంతృప్తితో ఉన్నారని, ఎమ్మెల్యే టికెట్‌ను స్థానికులకు ఇస్తే గెలిపించుకుంటామని వైసీపీ అధిష్ఠానానికి సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అధికారులను మంత్రి రోజా మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వైసీపీ నాయకులు, భాస్కర్‌రెడ్డి, పరంధామయాదవ్, వాసుదేవరెడ్డి, జయచంద్రా రెడ్డి పాల్గొన్నారు.

బస్సును ఢీకొన్న లారీ

35మందికి గాయాలు




లారీ ఢీకొనడంతో దెబ్బతిన్న బస్సు

పెళ్లకూరు, మార్చి 2:పెళ్లకూరు మండల పరిధిలోని టెంకాయతోపు వద్ద 71వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో 35 మంది గాయపడ్డారు.పోలీసుల కథనం మేరకు....నెల్లూరు జిల్లా రాపూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నెల్లూరు నుంచి తిరుపతికి 55మంది ప్రయాణికులతో బయలు దేరింది. శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేట వైపు వస్తున్న లారీ ఈ బస్సును ఎదురుగా వేగంగా ఢీనడంతో బస్సు డ్రైవర్ రవీంద్రతో పాటు 35మందికి గాయాలయ్యాయి.పాలచ్చూరు సర్పంచు పెళ్లూరు షర్మిల, ఫైడాం వెంకటసుబ్బయ్య, పొదలకూరు మండలం చాడగుట్ల గ్రామానికి చెందిన కలివేటి సుబ్బయ్య, మణికుమారి తదితరులకు తీవ్రగాయాలవడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్రంగా గాయపడ్డ సర్పంచు షర్మిల, సుబ్బయ్య



హథీరాంజీ మఠం భూములు

కొని మోసపోవద్దు

● మఠం ఫిట్‌పర్సన్ రమేష్‌నాయుడు

తిరుమల, మార్చి2(ఆంధ్రజ్యోతి):ప్రజలెవరూ హథీరాంజీ మఠానికి చెందిన భూములు సంబంధం లేని వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి మోసపోవద్దని మఠం ఫిట్‌పర్సన్ రమేష్‌నాయుడు సూచించారు. తిరుమలలోని హథీరాంజీ మఠంలో సీజ్ చేసి ఉన్న మహంతు గదిని శనివారం ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యవతి, జిల్లా ఎండోమెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, మఠం తాత్కాలిక మహంతు ఓం ప్రకాష్‌దాస్ తదితరులతో కలిసి రమేష్ నాయుడు తెరిచారు.లోపలున్న కొన్ని వస్తువులను స్వాధీన పరుచుకున్నారు. అనంతరం రమేష్ నాయుడు మీడియాతో మాట్లాడారు.ఇటీవల మఠానికి తాత్కాలిక మహంతుగా నియమితుడైన ప్రకాష్ దాస్‌కు నివాసం కోసమే గది తెరిచామన్నారు. మఠం భూముల్లోని ఆక్రమణలను తొలగించే విషయంలో తిరుపతి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోందన్నారు.ఆక్రమణలు తొలగించేందుకు తీసుకువెళ్లే పొక్లయినర్ ముందు కూర్చోవడంతో పాటు తమపై దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఇకనైనా తక్కువ రేటుకు వస్తున్నాయని కష్టపడి సంపాదించిన డబ్బును సంబంధం లేని వ్యక్తులకు ఇచ్చి మఠం భూములు కొనుగోలు చేయవద్దని సూచించారు. ఏరోజుకైనా మఠం భూములను స్వాధీనపరుచుకోవడంతో పాటు అందులోని కట్టడాలను కూల్చివేస్తామని హెచ్చరించారు.మఠానికి చెందిన భూములపై ధార్మిక పరిషత్ ప్రత్యేక సర్వే టీంను ఏర్పాటు చేసిందన్న ఆయన కబ్జాలో వున్న శాశ్వత నిర్మాణాలపై త్వరలో ఓ నిర్ణయం తీసుకుంటుందన్నారు.మఠానికి గతంలో మహంత్‌గా ఉండి సస్పెండైన అర్జున్‌దాస్ తప్పించుకు తిరుగుతున్నారన్నారు.ధార్మిక పరిషత్ ఏర్పాటు చేసిన విచారణ కమిటీకి కూడా సహకరించలేదన్నారు. ఈ క్రమంలో కమిటీ అందజేసిన నివేదిక ఆధారంగా అర్జున్‌దాస్‌ను శాశ్వతంగా తొలగించినట్టు తెలిపారు. ఇకపై మఠానికి, ఆయనకు ఎలాంటి సంబంధం లేదన్నారు.అనధికారికంగా మఠం భూములను ఓ ప్రైవేట్ సంస్థకు లీజుకు ఇచ్చేందుకు ఎంఓయూ కుదుర్చుకున్న ఆయన బంధుమిత్రులను మఠాల్లో వివిధ పోస్టుల్లో నియమించారన్నారు.మఠం నిధులను కూడా దుర్వినియోగం చేశారన్నారు.

పీటీసీలో చట్టాలపై శిక్షణ

చంద్రగిరి, మార్చి 2: ఎ.రంగంపేట సమీపంలోని కళ్యాణి డ్యామ్ పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు భారత ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మూడు చట్టాలపై అవగాహన కల్పించారు. భారతీయ న్యాయ సంహిత, నాగరిక సురక్ష సంహిత, సాక్ష్య అధినీయంపై పోలీస్ సిబ్బందికి గత నెల 26 నుంచి శనివారం వరకు వర్చువల్ తరగతులు నిర్వహించారు.

ముక్కోటిలో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం


మూషిక వాహనంపై దర్శనమిస్తున్న వినాయకస్వామి

చంద్రగిరి, మార్చి 2: తొండవాడ స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరాలయంలో శనివారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 2 నుంచి 10వ తేది వరకు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం స్వామివారికి ప్రత్యేకాభిషేకం, ఆనందవల్లిదేవికి అభిషేకం చేసి, విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం 6 గంటలకు మహాశివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. రాత్రి 7 గంటలకు వినాయకస్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి, మూషిక వాహనంపై అదిష్ఠించి ఆలయ ప్రదక్షణగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రేపు చంద్రగిరిలో ప్రత్యేక విద్యుత్ అదాలత్

చంద్రగిరి, మార్చి 2: చంద్రగిరిలోని విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఈఈ వాసురెడ్డి ఒక ప్రటకనలో తెలిపారు. ఈ ఆదాలత్‌కు చైర్మన్, రిటైర్డు జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు ఈశ్వరమ్మ హాజరవుతారని పేర్కొన్నారు.

బ్యూటీపార్లర్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి, మార్చి 2: పట్టణంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 6 నుంచి 30 రోజులపాటు మహిళలకు బ్యూటీ పార్లర్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ మహిళలు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. కనీసం పదోతరగతి చదివి ఉండాలన్నారు వివరాలకు 7989680587, 9494951289, 6301717672 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కొటాల పంచాయతీలో ఇంటింటిప్రచారం

చంద్రగిరి,మార్చి2: చంద్రగిరి నియోజకవర్గంలో యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేది చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పులివర్తి నానినే అని ఆయన తనయుడు పులివర్తి వినీల్ అన్నారు. శనివారం చంద్రగిరి మండలంలోని కొటాల పంచాయతీలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పులివర్తి వినీల్ ఇంటింటికి వెళ్ళి టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, టీడీపీ మహిళా రాష్ట్ర కార్యదర్శి సింగు సుధా, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగుడుపల్లెలో 'గడప గడపకు'

చంద్రగిరి, మార్చి 2: చంద్రగిరి మండలం గంగుడుపల్లె పంచాయతీలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ కరపత్రాలు పంపిణీ చేశారు.

టీడీపీ పాలనలోనే మహిళాభ్యున్నతి


కుమ్మరపల్లెలో సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తున్న సుధా రెడ్డి

భాకరాపేట, మార్చి 2: టీడీపీ పాలనలోనే మహిళాభ్యున్నతి సాధ్యమని పులివర్తి సుధా రెడ్డి అన్నారు. 'మీ ఇంటికి మీ పులివర్తి నాని కార్యక్రమంలో భాగంగా చిన్నగొట్టిగల్లు మండలం తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీ కుమ్మరపల్లె, కోడెకంభంవారిపల్లె, రెడ్డివారిపల్లె, నాగేవాళ్లపల్లె, టంగుటూరువాండ్లపల్లె, ఫైమిట్ట గ్రామాల్లో శనివారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించి సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, ప్రధాన కార్యదర్శి మదనమోహన, తెలుగు మహిళ అధ్యక్షురాలు చిట్టెమ్మ, నాయకులు మోహన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఆర్వీ రమణారెడ్డి, చంద్రశేఖర్, రాజగోపాల్ నాయుడు, వెంకట నాగిరెడ్డి, మునిరామయ్య, మునస్వామి నాయుడు, సురేంద్ర, మునిరాజా, గురుమూర్తి, మురళి, బాలసుబ్రహ్మణ్యం, చలపతి,మున్నాసాహెబ్, వెంకటరామయ్య, రమేశ్‌రెడ్డి, నరసింహారెడ్డి, మల్లికార్జున రెడ్డి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేలలో ఈ- క్రాప్ నమోదు వివరాలు

ఎర్రావారిపాలెం, మార్చి 2 : మండలంలో 1016 మంది రైతులు రబీలో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు చేసినట్లు ఏవో ఖాదర్‌బాషా తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 1611 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేశారన్నారు. ఈ-క్రాప్ చేయించుకున్న రైతుల జాబితాలు ఆయా ఆర్బీకేలలోని నోటీసు బోర్డుల్లో ఉంచినట్లు ఆయన తెలిపారు జాబితాపై అభ్యంతరాలు, సవరణలు ఏవైనా ఉంటే గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు.

ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

● తొలిరోజు 675 మంది విద్యార్థుల గైర్హాజరు


పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

తిరుపతి(విద్య), మార్చి 2 : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం 9-12గంటల వరకు జరిగిన సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2పరీక్షకు జిల్లాలో 675మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 87 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విభాగంలో 28,292మంది విద్యార్థులకుగాను 27,617మంది పరీక్ష రాశారని వెల్లడించారు. ఇందులో జనరల్ విభాగంలో 27,169మందికిగాను 26,569మంది విద్యార్థులు హాజరవ్వగా 600మంది హాజరుకాలేదు. ఒకేషనల్ విభాగంలో 1,123మందికి 1,048మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాయగా, 75మంది గైర్హాజరైనట్లు వివరించారు. డీఈసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షలను పర్యవేక్షించాయి. సోమవారం ప్రథమ ఇంటర్ విద్యార్థులకు పరీక్ష జరగనుంది.

వైభవంగా రేణుకాపరమేశ్వరి బ్రహ్మోత్సవాలు



తిరుపతి (కల్చరల్), మార్చి 2: పట్నూలు వీధిలో వెలసిన రేణుకాపరమేశ్వరి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో మూడో రోజైన శనివారం అమ్మవారు వివిధ అలంకరణలలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్నూలు వీధి ప్రముఖులు, ఆలయ పాలక మండలి అధ్యక్షుడు దానా వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నేత నవీన్‌కుమార్ రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.



ముత్యపుపందిరి వాహనంలో బకాసురవధ అలంకరణలో వెంకన్న - సింహవాహనంపై యోగ నరసింహస్వామి అలంకరణలో కల్యాణ వెంకన్న

ముత్యపు పందిరిలో మురిపించిన వెంకన్న


వివిధ దేవతామూర్తుల వేషధారణలో విద్యార్థులు

చంద్రగిరి, మార్చి 2: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సింహ, ముత్యపు పందిరి వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు.ఉదయం స్వామివారి ఉత్సవమూర్తిని వాహన మండపానికి తీసుకొచ్చి యోగ నరసింహస్వామిగా అలంకరించి సింహ వాహనంపై అధిష్ఠింపజేసి, తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అలాగే సాయంత్రం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి స్వామివారి ఉత్సవమూర్తిని వాహన మండపానికి తీసుకొచ్చి, బకాసుర వధ అలంకరణ చేసి, ముత్యపు పందిరి వాహనంపై అధిష్ఠించగా రాత్రి 7 గంటలకు ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమాలలో డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, కంకణభట్టర్ శేషాచార్యులు, అర్చకులు బాలాజీ రంగాచార్యులు, పార్థసారథి, నారాయణచార్యులు, సూపరింటెండెంట్లు మునిచెంగల్రాయులు, వెంటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పవన్‌ను విమర్శిస్తే నాలుక చీరేస్తాం

● జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్


మీడియాతో మాట్లాడుతున్న కిరణ్‌రాయల్

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 2: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను విమర్శిస్తే నాలుక చీరేస్తామని ఆ పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ హెచ్చరించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో కాపుసేన నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లక్రితం ఉన్న కాపులు ప్రస్తుతం రాష్ట్రంలో లేరని, ఇపుడున్న యువత వందశాతం పవన్ కల్యాణ్ వెంట ఉందని, ఈ విషయాన్ని హరిరామజోగయ్య, ముద్రగడ పద్మనాభం గుర్తు పెట్టుకోవాలని అన్నారు. పవన్ కల్యాణ్ కాపుల్లో ఐక్యత తీసుకువచ్చారన్నారు. టీడీపీ, జనసేన పొత్తును చెడగొట్టేందుకు హరిరామజోగయ్య, ముద్రగడ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. హరిరామజోగయ్య మాట ఆయన కుమారుడే వినడని, అలాంటప్పుడు పవన్‌కల్యాణ్ ఎలా వింటారని ప్రశ్నించారు. వైసీపీతో కలిసి కాపుల్లో ఐక్యతను దెబ్బతీసే విధంగా దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వయసుకు తగినట్లు నడుచుకోవాలని హితవుపలికారు. ఈ సమావేశంలో కాపు నాయకులు కొండ రాజమోహన్, హిమవంత్, వంశీకృష్ణ, హేమంత్, పురుషోత్తం, నాగరాజు, ఆది పాల్గొన్నారు.

తొలగించిన క్షురకులను వెంటనే తీసుకోవాలి


రాధాదేవి

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 2 : టీటీడీ కల్యాణకట్టలో తొలగించిన క్షురకులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని టీటీడీ మహిళా క్షురకుల సంఘం అధ్యక్షురాలు రాధాదేవి కోరారు. ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఇచ్చిన హామీ మేరకు కల్యాణకట్టలో తొలగించిన తొమ్మిది మందిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. టీటీడీ ఉద్యోగుల తరహాలో కల్యాణకట్ట కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలన్న న్యాయస్థానం తీర్పును టీటీడీ లెక్క చేయకపోవడం బాధాకరమన్నారు. పదో తేదీలోపు విధుల్లోకి తీసుకోకపోతే 13వ తేదీ నుంచి దశలవారీగా పోరాటం చేస్తామన్నారు. సీఐటీయూ నేత కందారపు మురళిపై టీటీడీ బోర్డు సభ్యుడు యానాదయ్య చేసిన ఆరోపణలకు క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

షటిల్ బ్యాడ్మింటన్ విజేత సీఈ


షటిల్ బ్యాడ్మింటన్ విజేత సీఈ నాగేశ్వరరావు

తిరుపతి(కొర్లగుంట), మార్చి 2: టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలలో భాగంగా శనివారం జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ప్రిన్సిపాల్ సురేంద్రపై చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు విజయం సాధించారు. డబుల్స్‌లో డిప్యూటీ ఈవో గోవిందరాజన్-ప్రిన్సిపాల్ సురేంద్ర జట్టుపై డీఈవో భాస్కర్‌రెడ్డి-డిప్యూటీ ఈవో శివప్రసాద్ జట్టు విజేతగా నిలిచింది. మహిళా ఉద్యోగుల టెన్నికాయిట్ డబుల్స్‌లో జూనియర్స్‌లో పద్మజ-సునంద జట్టుపై ధనశ్రీ-శశికళ జట్టు విజేతగా నిలిచింది. సీనియర్స్‌లో కళావతి-నిర్మలరాణి జట్టుపై సులోచనరాణి-ఉషారాణి జట్టు గెలుపు, సింగిల్స్‌లో నిర్మలరాణిపై సులోచన గెలుపొందారు. విశ్రాంత మహిళా ఉద్యోగుల క్యారమ్స్ డబుల్స్‌లో సావిత్రి-కృష్ణవేణి జట్టుపై ప్రభావతమ్మ-సురేఖ జట్టు విజేతగా, సింగిల్స్‌లో ప్రభావతమ్మపై సురేఖ విజయం సాధించారు.

తాయిలాలే చెవిరెడ్డి పెట్టుబడి : పులివర్తి నాని


స్థానికులతో మాట్లాడుతున్న పులివర్తి నాని

తిరుచానూరు, మార్చి 2: వ్యాపారమే రాజకీయంగా... తాయిలాలే పెట్టుబడిగా పెట్టి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నియోజవర్గ అభివృద్ధిని విస్మరించారని టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని విమర్శించారు. శనివారం 'మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు పంచాయితీలో నాని పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, వంతెనలు, కల్వర్టులు నిర్మించడం, పరిశ్రమలు తీసుకురావడం వంటి అంశాలను ఎమ్మెల్యే పూర్తిగా విస్మరించారని తెలిపారు. గంజాయి మాత్రం విచ్చలవిడిగా దొరుకుతోందన్నారు. వైఎస్ సునీత కోరిక మేరకు వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో జగన్‌రెడ్డి పాత్రపై విచారణ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, సల్మాన్ రాజ్, శ్రీనివాసులు, మునిరత్నంరెడ్డి, వాసు, హరేరామ్, పాండి, సాయిరాయల్, రమేష్ రాజేంద్ర, నాగూరు, రమేష్ చౌదరి, జీవన్, కలీముల్లా పాల్గొన్నారు.


అమ్మవారి ఆలయం వద్ద హైకోర్టు జడ్జి జస్టిస్ వి.గోపాలకృష్ణరావు

అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

తిరుచానూరు, మార్చి 2: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని హైకోర్టు జడ్జి వి.గోపాలకృష్ణరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు ఆలయం వద్ద సూపరింటెండెంట్ శేషగిరి, అర్చకులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ వేదపండితులు జస్టిస్ గోపాలకృష్ణరావును ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందించారు. అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల నివాళులు


నివాళులుఅర్పిస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, మార్చి 2: మండలంలోని అనుపల్లి గ్రామానికి చెందిన తాండాయం కృష్ణమాచారి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు.శనివారం ఉదయం టీడీపీ మండల అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, సీనియర్ నాయకులు జనార్ధన్ చౌదరి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బిందు మాధవి, టీడీపీ యువనాయకుడు విజయ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎన్ రత్నంనాయుడు, రాంపూరి అల్లెయ్య, రాకేష్ రెడ్డి, గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని..


కాలినడకన తిరుమలకు వెలుతున్న జీవన్‌కుమార్ రెడ్డి

తిరుపతి రూరల్, మార్చి 2: చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని పెరుమాళ్లపల్లెకు చెందిన జీవన్‌కుమార్‌రెడ్డి శ్రీవారి మెట్టు మార్గాన తిరుమలకు శనివారం పాదయాత్రగా వెళ్లారు. శ్రీవారిని దర్శించుకొని మొక్కుకున్నారు. చంద్రబాబు సీఎం కావాలని, పులివర్తి నాని చంద్రగిరి ఎమ్మెల్యే కావాలని ఆయన కోరుకున్నారు.

పల్స్ పోలియోపై అవగాహనా ర్యాలీ



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ సీవీ రమణ

తిరుపతి రూరల్, మార్చి 2: అవిలాల పంచాయతీలో పల్స్ పోలియోపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ సీవీ రమణ నేతృత్వంలో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శనివారం ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా సర్పంచ్ సీవీ రమణ మాట్లాడుతూ.. పోలియో మహమ్మారిని శాశ్వతంగా తరిమి వేసేందుకు ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఆదివారం అవిలాల సచివాలయంలో పోలియో చుక్కలు ప్రతి చిన్నారికీ వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ అధికారుల నిజాయితీ



తిరుచానూరు,మార్చి 2: పద్మావతి అమ్మవారి ఆలయ క్యూలైన్ వద్ద భక్తులు మరచిపోయిన నగదు ఉన్న పర్సుతో పాటు ఐఫోన్ ఆలయ అధికారులు అప్పగించి తమ నిజాయతీని చాటుకున్నారు. మహారాష్ట్ర థానేకు చెందిన మహేష్ కుటుంబ సభ్యులు శనివారం సాయంత్రం అమ్మవారి దర్శనానికి విచ్చేశారు. ఆలయం వెలుపల లగేజీ స్టాండింగ్ వద్ద తమ నగదు ఉన్న పర్సు, ఐఫోన్‌ను వదిలి మరచి వెళ్లిపోయారు. దర్శనానంతరం వెలుపలకు వచ్చిన భక్తబృందానికి పర్సు లేకపోవడాన్ని గుర్తించారు. అప్పటికే ఆలయ అధికారులు అనౌన్స్‌మెంట్ చేశారు. భక్తులు చెప్పిన వివరాల ప్రకారం ఏవీఎస్వో సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ కేపీ చంద్రశేఖర్, ఆలయ విజిలెన్స్ అధికారి బ్రహ్మానందరావు భక్తులు పోగొట్టుకున్న రూ.55వేలు నగదు, ఐఫోన్ అందజేశారు.



అలిపిరి వద్ద కిక్కిరిసిన వాహనాలు

తిరుమల, మార్చి2(ఆంధ్రజ్యోతి): తిరుమలకు ప్రవేశమార్గమైన అలిపిరి చెక్‌పాయింట్‌లో శనివారం వాహనాలు కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అలిపిరి వాహనాలతో కిటకిటలాడింది. 30 నిమిషాల నుంచి గంట పాటు అలిపిరిలోనే వాహనదారులు నిరీక్షించాల్సి వచ్చింది. వాహనాలు భారీగా నిలిచిపోవడంతో భద్రతా సిబ్బంది తనిఖీలను వేగవంతం చేశారు. మధ్యాహ్నం తర్వాత రద్దీ తగ్గింది.

హెల్మెట్ల వినియోగంపై అవగాహన


హెల్మెట్ల వినియోగంపై ద్విచక్రవాహనదారులతో మాట్లాడుతున్న వీఐ రమణారెడ్డి

తిరుమల, మార్చి2 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని జీఎన్సీ టోల్‌గేట్ వద్ద శనివారం విజిలెన్స్ అధికారులు హెల్మెట్ల వినియోగంపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. టీటీడీ కొన్నేళ్లుగా ఘాట్ రోడ్డులో హెల్మెట్ వాడకాన్ని తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. ఇటీవల కొంతమంది హెల్మెట్లు లేకుండా ప్రయాణిస్తుండటాన్ని గుర్తించిన విజిలెన్స్ అధికారులు శనివారం సాయంత్రం తిరుమల జీఎన్సీ టోల్‌గేట్ వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ఘాట్ రోడ్డులో ప్రయాణించడం సురక్షితంగా కాదని, హెల్మెట్ వినియోగించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాగునీటి సమస్య రాకుండా చూడండి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 2: కరువు మండలాల్లో ఉపాధి హామీ పనులు పక్కాగా అమలు చేయాలని, అలాగే తాగునీటి సమస్య రాకుండా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రణాళికాబద్ధంగా పనిచేస్తూ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. శనివారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి వర్చువల్ విధానంలో వివిధ అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశమై మూడవ దశ రీసర్వే, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్, కరువు మండలాల్లో ఉపాధి పనులు, షెల్ఫ్ ఆఫ్ వర్క్స్ గుర్తింపు, తాగునీటి సమస్యపై చర్చించారు. ఎంఎస్ఎంఈ సర్వే, ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలన్నారు. రోజువారీ ధాన్యం ధరలను సీఎం యాప్‌లో అప్డేట్ చేయాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీకార్డులు వందశాతం పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచలకిషోర్, అధికారులు శ్రీనివాస ప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, జయరాజ్, విజయకుమార్, శంకరనారాయణ, శ్రీహరి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్, కరువుభత్యం విడుదల చేయాలి


సమావేశానికి హాజరైన పెన్షనర్స్

తిరుపతి(కొర్లగుంట), మార్చి 2: విశ్రాంత ఉద్యోగులకు వెంటనే ఐఆర్, కరువుభత్యం విడుదల చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.మార్కొండరెడ్డి డిమాండ్ చేశారు. బాలాజీకాలనీలోని పెన్షనర్స్ భవనంలో శనివారం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ఈ నెల 14న జరిగే పెన్షనర్ల రాష్ట్ర సభలకు అధిక సంఖ్యలో సభ్యులు హాజరుకావాలని తీర్మానించారు. ఈ సమావేశంలో ఆర్.డి.సుబ్రహ్మణ్యం, ఎ.రామకృష్ణయ్య, ఆర్.శ్రీనివాసులరెడ్డి, జె.రామలింగారెడ్డి, ప్రసాదరెడ్డి, ఎ.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కరాటే శిక్షణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 2: పద్మావతి యూనివర్సిటీలో వారం రోజులుగా నిర్వహించిన కరాటే శిక్షణ శనివారం ముగిసింది. విద్యార్థినుల స్వీయ రక్షణ కోసం అవసరమైన మెలకువలను నిపుణులు నేర్పారు. తద్వారా మాన, ప్రాణ రక్షణ సాధ్యమవుతుందని నిపుణుడు ధనుంజయులు పేర్కొన్నారు. విద్యార్థినులకు నిర్వాహకులు ఉమాదేవి, ఇంద్రాణి సర్టిఫికెట్లు అందజేసి, అభినందించారు.

విజయవంతంగా గుర్రపు యాత్ర

● తిరుపతికి చేరుకున్న ఎన్‌సీసీ క్యాడెట్ల బృందం


తిరుపతికి చేరుకున్న గుర్రపు యాత్ర

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 2: ఎన్‌సీసీ ఆధ్వర్యంలో చేపట్టిన గుర్రపు యాత్ర విజయవంతంగా ముగిసింది. వారం రోజులుగా తిరుపతి జిల్లాలోని పలుచోట్ల 30 మంది క్యాడెట్లు, 7 గుర్రాలు, 10 మంది ఆర్మీ సిబ్బంది, 10 మంది సిబ్బందితో 210 కిలోమీటర్ల మేర యాత్ర చేపట్టారు. సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం, రక్తదానం, జలవనరుల ప్రక్షాళన, చిరుధాన్యాల ప్రాధాన్యం వంటి అంశాలపై ఈ బృందం అవగాహన కల్పిస్తూ ముందుకు సాగింది. యాత్రను విజయవంతంగా చేపట్టిన బృందాన్ని ఎన్‌సీసీ ఉన్నతాధికారులు అభినందించారు.

5ఏళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 2: జిల్లావ్యాప్తంగా ఉన్న ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. పల్స్ పోలియో, నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ తదితరాలపై చర్చించారు. అధికారులు శ్రీనివాసరెడ్డి, శ్రీహరి, శ్రీనివాసరావు, రాజశేఖర్‌రెడ్డి, సుశీలదేవి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటు ఆస్పత్రులతో పోటీ పడాలి


ఆస్పత్రి అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ ఆంజనేయులు

తిరుపతి సిటీ, మార్చి 2 : కార్మికులకు వైద్య సేవలు అందించడంలో కార్పొరేటు ఆస్పత్రులతో పోటీ పడాలని ఈఎస్ఐ ఆస్పత్రి రాష్ట్ర బీమా వైద్యశాఖ డైరెక్టర్ ఆంజనేయులు అన్నారు. స్థానిక ఈఎస్ఐని శనివారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల ఆస్పత్రిలో నీటి సమస్యతో రోగులు, సిబ్బంది ఇబ్బందిపడిన విషయం తమ దృష్టికి వచ్చిందని, అలాంటివి వెంటనే పరిష్కరిస్తామని అన్నారు. నీటి సమస్యకు కారణమైన పైపులను పరిశీలించారు. అలాగే ఆస్పత్రికి వచ్చే కార్మికులను ఇతర ఆస్పత్రులకు రెఫరల్ చేయకుండా ఇక్కడే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. అవసరమైతే ప్రత్యేక నిపుణులను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అనంతరం ల్యాబ్, ఫార్మసీ, ఆపరేషన్ థియేటర్లు, రోగుల వార్డులను పరిశీలించారు. వైద్య సేవలు, సదుపాయాల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు.

నేటినుంచి పల్స్ పోలియో

● మూడు రోజుల్లో 2,53,282మంది చిన్నారులకు చుక్కల మందు

తిరుపతి సిటీ, మార్చి 2 : జిల్లాలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 0-5 ఏళ్లలోపు గుర్తించిన 2,53,282 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1,824 కేంద్రాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. సోమ, మంగళవారాల్లో వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి చిన్నారులను గుర్తించి, చుక్కలు వేయనున్నారు. మొదటి రోజే 80 శాతం లక్ష్యాన్ని అధిగమించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 34 మండలాలు, ఆరు మున్సిపాలిటీలు, ఒక మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 58 పీహెచ్‌సీలు, 25 యూపీహెచ్‌సీలతోపాటు 2,492 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పక్కాగా నిర్వహించనున్నారు. 7,774 మంది సిబ్బందిని ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నారు. తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకూ పోకుండా తప్పనిసరిగా పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని జిల్లా వైద్యాధికారులు కోరుతున్నారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై కపిలేశ్వరుడు



సూర్యప్రభ వాహనంలో కపిలేశ్వర స్వామి

తిరుపతి (కల్చరల్), మార్చి 2: కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శనివారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ పట్టణవీధుల్లో వాహన సేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలో సోమస్కందస్వామి, కామాక్షి అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు చంద్రప్రభ వాహన సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ డిప్యూటి ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

85ఏళ్లు పైబడిన వారికి హోమ్ ఓటింగ్ : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 2: 85 ఏళ్లు దాటి పోలింగ్ కేంద్రాలకు రాలేని వారికి హోమ్ ఓటింగ్‌కు అవకాశం ఉంటుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. శనివారం వివిధ పార్టీల నేతలతో సమావేశమైన ఆయన పలు అంశాలపై చర్చించారు. 2024 ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ వేసే ముందు రోజు ప్రత్యేక బ్యాంకు ఖాతా, చెక్‌బుక్ కలిగి ఉండాలన్నారు. జిల్లాలో 61 పోలింగ్ స్థానాల మార్పునకు, 80 పోలింగ్ కేంద్రాల పేరు మార్పు, ఆరు ఆగ్జిలరీ పోలింగ్ కేంద్రాల ఆమోదం కోసం చీఫ్ ఎలక్టోరల్ అధికారి కార్యాలయానికి పంపించినట్లు తెలిపారు. ఈఎస్ఎంఎస్, సి-విజిల్, ఈవీఎం వాడకంపై నోడల్ అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన అంశాలను పరిశీలించి, నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో పెంచలకిషోర్, ఈఆర్వోలు ఆదితిసింగ్, కిరణ్‌కుమార్, రవిశంకర్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి, చంద్రముని, కోదండరామిరెడ్డి, అదనపు ఎస్పీ రాజేంద్ర, ట్రైనింగ్ నోడల్ అధికారి రామ్మోహన్, ఎస్ఐసీ అదనపు డీఐవో వెంకటేశ్వరరావు, ఎస్డీసీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సివిజిల్ నోడల్ అధికారి ప్రసాదరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వివేకా హత్య కేసులో జగన్ పాత్రపై సీబీఐ విచారణ జరపాలి



మీడియాతో మాట్లాడుతున్న మునికృష్ణ

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 2: మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో సీఎం జగన్ పాత్రపై సీబీఐ విచారణ చేపట్టాలని టీడీపీ కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కేవలం రాజకీయ లబ్ధి కోసమే వైఎస్ వివేకానందరెడ్డిని హతమార్చారన్నారు. లేకపోతే గొడ్డలిపోటుతో బాబాయి చనిపోయారని జగన్‌కు అంత కచ్చితంగా ఎలా తెలిసిందని ప్రశ్నించారు. వివేకా కూతురు సునీత సీబీఐ విచారణకు వెళ్లబోతే ఎందుకు ఆపాలని ప్రయత్నించారో ప్రజలకు తెలపాలన్నారు. హత్యకేసులో నిందితులను ఎందుకు రక్షిస్తున్నారో.. కేసు విచారణ ఎందుకు ఆగిపోయిందో సునీత అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాలన్నారు. అలాగే వైసీపీకి ఫ్యాన్ గుర్తు తొలగించి గొడ్డలి గుర్తు పెట్టుకోవాలని ఎద్దేవా చేశారు. రాష్ట్రం అభివృద్ధి కావాలంటే టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరాటే చంద్ర, సుబ్బయాదవ్, శ్రీధర్, సుధాకర్‌రెడ్డి, జగ్గ, నాగప్రతాప్ పాల్గొన్నారు.

పురాణాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించండి

సేవా టికెట్‌తో పాటు గది బుక్‌చేసుకునే అవకాశమివ్వండి - డయల్ యువర్ టీటీడీ ఈవోలో భక్తులు



తిరుమల, మార్చి2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పురాణాలపై పోటీలు నిర్వహిస్తే భక్తిభావం పెరుగుతుందని నిఖిలేష్(నెల్లూరు), దర్శనం, సేవా టికెట్లతో పాటు గదిని కూడా బుక్ చేసుకునే అవకాశమివ్వాలని నాగేంద్ర(గుంటూరు) ఈవో ధర్మారెడ్డికి సూచించారు. ఈవో స్పందిస్తూ.. విద్యార్థులకు భగవద్గీత, అన్నమయ్య, వెంగమాంబ సంకీర్తనలపై పోటీలు నిర్వహించి శ్రీవారి దర్శనం కల్పిస్తున్నామన్నారు. పురాణాలపై పోటీలను పరిశీలిస్తామన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ బుకింగ్ ద్వారా దర్శనం, సేవా టికెట్లు పొందిన భక్తులకు వసతి కూడా అందుబాటులోకి వస్తుందని వివరించారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 28 మంది భక్తులు ఈవోతో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. లడ్డూలు రెండే ఇస్తున్నారని, ప్రతి భక్తుడికీ 10 ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని రామలక్ష్మి(నంద్యాల) విజ్ఞప్తి చేయగా సాధారణ రోజుల్లో కోరినన్ని లడ్డూలు విక్రయిస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి వంటి పర్వదినాల్లో మాత్రమే పరిమిత లడ్డూలు అందజేస్తున్నామన్నారు. ఆలయం ముందున్న టీటీడీ బుక్‌స్టాల్‌లో రూ.111 విలువ కలిగిన గోవింద నామాల పుస్తకాన్ని అడిగితే అక్కడ సిబ్బంది బలవంతంగా రూ.150 చొప్పున రెండు పుస్తకాలు విక్రయించారని ఫిర్యాదు చేశారు. పరిశీలించి విధుల్లో ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఈవో బదులిచ్చారు. శ్రీవారిని దగ్గరగా చూసే అవకాశమివ్వాలని సుధాకర్(గుంతకల్), రవీంద్ర (హైదరాబాద్) కోరారు. వీఐపీ సిఫార్సులు, శ్రీవాణి ట్రస్టు ద్వారా బ్రేక్ దర్శన టికెట్లతో దర్శనం చేసుకోవచ్చని సూచించారు. తిరుపతి నుంచి తిరుమలకు నామమాత్రపు ధరలకు టీటీడీ బస్సులను నడిపితే బాగుంటుందని వెంకటేష్(హైదరాబాద్) సూచన చేయగా సాధ్యం కాదని ఈవో స్పష్టం చేశారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



ఎల్ మురుగన్ - హిందూజ - పృథ్వీరాజ్

తిరుమల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో కేంద్రమంత్రి ఎల్ మురుగన్, రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, బాలవీరాంజనేయస్వామి, నటుడు పృథ్వీరాజ్, తమిళనటి హిందూజ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

మైదానం పరిరక్షణకు న్యాయ పోరాటం చేద్దాం



సమావేశమైన ఎస్వీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

తిరుపతి(కొర్లగుంట), మార్చి 2: ఎస్వీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం పరిరక్షణకు న్యాయ పోరాటం చేద్దామని పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం నిర్ణయించింది. శనివారం అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన సమావేశంలో సంఘ ముఖ్య నాయకులు ఊకా విజయ్‌కుమార్, ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మైదానం ముందుభాగంలో గతంలో వాణిజ్య సముదాయం, తాజాగా ఎస్వీ మ్యూజిక్ కళాశాల అనుబంధంగా హాస్టల్ భవన నిర్మాణంతో గ్రౌండ్ విస్తీర్ణం కుచించుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్మాణాలు ఆపేందుకు హైకోర్టు స్థాయిలో పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయడానికి అవసరమైన ఆర్థిక, నైతిక మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ విద్యార్థి మునిరత్నం, మణిరెడ్డి, కోదండరాముడు, చంద్రమౌళి, శ్రీధర్‌రావు, సాయికుమార్, బి.వి.రమణ, భాష్యం శ్రీనివాస్, సి.వి.భాస్కర్, అబ్బులు, వెంకటేష్, భక్తవత్సలం, రవి, దేవరాజులు, వీరమోహన్, కాంతారావు, ఎస్.వి.ఎం.వెంకటేష్, సంగీత బాబు పాల్గొన్నారు.



పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ

తిరుమల, మార్చి2(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అశ్విని ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ కుసుమ కుమారి ఆధ్వర్యంలో ఎస్వీ హైస్కూల్ నుంచి బాలాజీనగర్ వరకు ర్యాలీ సాగింది. ఐదేళ్లలోపు పిల్లలకు ఆదివారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ ర్యాలీలో డీఈవో భాస్కర్‌రెడ్డి, హెడ్‌నర్సు సావిత్రమ్మ, ఆస్పత్రి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేనపై విమర్శలు తగవు : హరిప్రసాద్

తిరుపతి(కొర్లగుంట), మార్చి 2: రాష్ట్ర ప్రయోజనాల కోసం జనసేనాని పవన్‌కల్యాణ్ తీసుకునే నిర్ణయాలను తప్పుపట్టే అధికారం ఎవరికీ లేదని జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాబోవు ఎన్నికల్లో పవన్ సరికొత్త రాజకీయ మంత్రాన్ని ప్రయోగించబోతున్నారని తెలిపారు. పార్టీ కష్టాల్లో ఉన్నపుడు పట్టించుకోని వారు ఇప్పుడు పవన్ నిర్ణయాన్ని తప్పుబట్టడం బాధాకరమని పేర్కొన్నారు. అవాకులు చవాకులు పేలితే సరైన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

శ్రీరామ ఇంజినీరింగ్ కాలేజీకి న్యాక్‌ఏగ్రేడ్

తిరుపతి(విద్య), మార్చి2: కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలకు న్యాక్ ఏగ్రేడ్ లభించినట్లు కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి పేర్కొన్నారు. గతనెల 22, 23తేదీల్లో కళాశాలను సందర్శించిన జాతీయ అంచనా, అక్రిడిటేషన్ కమిటీ ప్రతినిధులు మౌలిక సదుపాయాలు, లైబ్రరీ, విద్యావనరులు, పరిశోధనా కేంద్రాలు వంటి అంశాలను పరిశీలించి న్యాక్ ఏగ్రేడ్‌ని ప్రకటించారని తెలిపారు. డైరెక్టర్స్ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవింద్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ టీచింగ్, నాన్‌టీచింగ్ సమష్టి కృషితో ఏగ్రేడ్ సాధించగలిగామని తెలిపారు. న్యాక్‌గ్రేడ్ రావడం పట్ల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, హెచ్‌వోడీలు, అధ్యాపకులు సంతోషం వ్యక్తపరిచారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



తిరుపతి (కల్చరల్), మార్చి 2: నగరంలో స్థానిక భక్తులు శనివారం నగర సంకీర్తన నిర్వహించారు. గోవిందరాజస్వామి ఆలయ మాడవీధులలో వేకువజామున జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నేత గుండాల గోపీనాథ్‌రెడ్డి, ఎస్.రాజా, జేజిరెడ్డి, తిరుపాలాచారి, శాంబోలు హరనాథ్, చెంగారెడ్డి, వెంకట్రామయ్య, ప్రభాకరనాయుడు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఈస్ట్ ఎస్ఐ



ఎస్ఐ లావణ్య

తిరుపతి(నేరవిభాగం), మార్చి 2: తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా లావణ్య శనివారం బాధ్యతలు తీసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇటీవల పోలీసు అధికారుల బదిలీలు నిర్వహించారు. సత్యసాయి జిల్లాలో ఎస్ఐగా పనిచేస్తున్న లావణ్యను తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆమె బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా, రాయదుర్గంకు చెందిన లావణ్య 2020 బ్యాచ్‌కుగాను పోలీసు శాఖకు ఎంపికయ్యారు.

ఎస్డీహెచ్ఆర్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో చైర్మన్ చక్రవర్తిరెడ్డి

తిరుపతి (విద్య), మార్చి 2: న్యూబాలాజీ కాలనీలోని ఎస్డీహెచ్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో గ్లోబల్ లాజిక్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 78మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎ.ఉష పేర్కొన్నారు. మూడురోజుల పాటు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో రాత పరీక్ష, ఇంటర్వ్యూలలో ప్రతిభ చాటిన విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారని వివరించారు. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు డిగ్రీ ఫైనలియర్ చదివే 300మంది వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు అర్హత సాధించారని తెలిపారు. విద్యార్థులను చైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

చేతక్ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్ ప్రారంభం



వినియోగదారుడికి బైక్ కీ అందజేస్తున్న మేయర్ శిరీష

తిరుపతి(కొర్లగుంట), మార్చి 2: రేణిగుంట ప్రధాన రహదారిలోని శ్రీరామ్ చేతక్ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌ను శనివారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ డాక్టర్ శిరీష ప్రారంభించి, మరో అతిథి ఐక్యరాజ్య డైరెక్టర్(యూఎస్ఏ) కొల్లిపర చంద్రకాంత్ చేతుల మీదుగా షోరూం నుంచి తొలి ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాన్ని వినియోగదారుడికి అందజేశారు. మేయర్ మాట్లాడుతూ బజాజ్ వాహనాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని, పాతకాలపు ద్విచక్ర వాహనాలను చాలా ఇళ్లలో గుర్తుగా భద్రపరుచుకొని ఉన్నారని అన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్ తయారు చేయడం శుభపరిణామమన్నారు. శ్రీరామ్‌బజాజ్ మేనేజింగ్ పార్టనర్స్ ఆర్.శ్రీనివాసరావు, ఆర్.సాకేత్‌రామ్ మాట్లాడుతూ ఎలక్ట్రిక్ స్కూటర్ చేతక్, ప్రీమియం (రూ.1,35,463), అర్బన్(రూ.1,15,002) రెండు రకాల వాహనాలు తాజా సాంకేతిక పరిజ్ఞానంతో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటిలోని 3.2కిలోవాట్ బ్యాటరీ పూర్తి ఛార్జింగ్‌తో 127 కిలోమీటర్లు నడుస్తుందన్నారు. కాల్ మేనేజ్‌మెంట్, మ్యూజిక్ కంట్రోల్ వంటి సదుపాయాలు ఉన్నాయని వివరించారు. బజాజ్ షోరూం అధినేతలు ఆర్.సుచిత్ర, ఆర్.అంజనశ్రావణి, ఆర్.వి.అభినవ్‌రామ్, డాక్టర్.ఆర్.ఎల్.ఎస్.శరణ్య, మేనేజర్ డి.వి.ఎస్.రాజు పాల్గొన్నారు.

విశ్వంలో పోటీ పరీక్షల సమాచార పత్రిక ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు

తిరుపతి(విద్య), మార్చి 2: వరదరాజనగర్‌లోని విశ్వం స్కూల్‌లో పోటీ పరీక్షల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో రూపొందించిన పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ, సైనిక్, నవోదయ పోటీ పరీక్షల సమాచార పత్రికను శనివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డితో విశ్వం స్కూల్ చైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.విశ్వతులసి కలసి ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్యార్థి దశనుంచి పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకుని, భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్షల సమాచారం కోసం 8688888802/03, 9399976999లను సంప్రదించాలని కోరారు. కడప కార్పొరేటర్ శ్రీదేవి, ఒకేషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర ఓబుల్‌రెడ్డి, అపుస్మా నాయకులు బి.రవీంద్రనాథ్‌రెడ్డి, సుభాషిణి పాల్గొన్నారు.

వినికిడి సమస్యలపై ఉచిత పరీక్షలు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 2 : ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 3, 4, 5 తేదీల్లో తిరుపతిలోని స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్‌లో వినికిడి సమస్యలపై ఉచిత పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ గోపీనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినికిడి సమస్యలున్న వారిని గుర్తించి, తక్కువ ఖర్చుతో యంత్రాలు ఇస్తామని, పాతవి ఎక్స్ఛేంజ్ చేసుకుంటామని వివరించారు. పూర్తి వివరాలకు 9849085342 నంబర్‌కు సంప్రదించగలరని ఆయన తెలిపారు.



కేంద్రమంత్రికి ఆహ్వానం పలుకుతున్న బీజేపీ నాయకులు

కేంద్రమంత్రికి స్వాగతం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 2: కేంద్రమంత్రి మురుగన్‌కు తిరుపతి బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం శనివారం వచ్చిన మంత్రికి అలిపిరి గరుడ సర్కిల్ వద్ద ఆహ్వానం పలికి, దుశ్శాలువతో సత్కరించారు. ఆయన మళ్లీ రాజ్యసభకు ఎంపికైనందుకు అభినందనలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ రాజేంద్రన్, బీజేపీ ఉత్తర మండల అధ్యక్షుడు ప్రభాకర్‌నాయుడు, నాయకులు జనార్దన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, రాజా, దొరై, శ్రీనివాసులు, బాబు ఉన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.86 కోట్లు

తిరుమల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.86 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 59,646 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,938 మంది తలనీలాలు సమర్పించారు.

అభివృద్ధిని ఆకాంక్షించే టీడీపీలో చేరికలు: పాశిం



హరిచంద్రారెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, మార్చి 2: రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే వారు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరు హరిచంద్రారెడ్డి నెల్లూరులో చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరేందుకు వెళుతుండంతో తూర్పువీధిలోని ఆయన నివాసంలో నాయకులు గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ హరిచంద్రారెడ్డి టీడీపీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. అందరినీ కలుపుకుని రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేస్తామన్నారు. హరిచంద్రారెడ్డి మాట్లాడుతూ సోదర సమానులైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి నడుస్తామన్నారు. ఆయనతో పాటు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్నామన్నారు. రానున్న ఎన్నికలు అహంకారానికి, అభిమానికి మధ్య జరుగుతున్నాయని, అందరం కలిసికట్టుగా టీడీపీ విజయానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం ర్యాలీగా నెల్లూరుకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వాటంబేడు శివకుమార్, ప్రణీత్, పెంచలయ్య, సురేంద్ర, దయాకర్, భారతి తదిరులు పాల్గొన్నారు.

ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

తొలిరోజు 675 మంది విద్యార్థుల గైర్హాజరు



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

తిరుపతి(విద్య), మార్చి 2 : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం 9-12గంటల వరకు జరిగిన సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2పరీక్షకు జిల్లాలో 675మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐవో జీవీ ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. 87 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విభాగంలో 28,292మంది విద్యార్థులకుగాను 27,617మంది పరీక్ష రాశారని వెల్లడించారు. జనరల్ విభాగంలో 27,169మందికిగాను 26,569మంది విద్యార్థులు హాజరవ్వగా 600మంది హాజరుకాలేదు. ఒకేషనల్ విభాగంలో 1,123 మందికి 1,048మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాయగా, 75మంది గైర్హాజరైనట్లు వివరించారు. డీఈసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షలను పర్యవేక్షించాయి. సోమవారం ప్రథమ ఇంటర్ విద్యార్థులకు పరీక్ష జరగనుంది.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కోట, మార్చి 2: జిల్లాలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకులాల్లో 2023-24 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకులాల జిల్లా కన్వీనర్ నారాయణరావు శనివారం తెలిపారు. కోట(బాలురు) 120 సీట్లు, దొరవారిసత్రం (బాలురు) 80 సీట్లు, సత్యవేడు(బాలురు) 80 సీట్లు, ఐతేపల్లి (బాలురు) 40 సీట్లు, వెంకగిరి (బాలురు)40 సీట్లు, గూడూరు(బాలికలు) 40 సీట్లు, ఉదయమాణిక్యం(బాలికలు) 80సీట్లు ఉన్నాయని నారాయణరావు తెలిపారు. బీసీ, ఈబీసీ, ఓసీ విద్యార్థులకు 9 నుంచి 11 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 9-13 సంవత్సరాల వయస్సు మించరాదన్నారు. జిల్లాలో 2022-22, 2023-24 విద్యా సంవత్సరాల్లో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3 నుంచి 4 తరగతులు చదివి ఉండాలన్నారు. ఈనెల 31వ తేదీ లోపు పాఠశాల వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నారాయణరావు తెలిపారు.

ప్రమాదవశాత్తూ ఏటిలో పడి వ్యక్తి మృతి

బాలాయపల్లి, మార్చి 2: ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి ఏటిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బాలాయపల్లిలో శనివారం వెలుగులోకి వచ్చింది. బాలాయపల్లికి చెందిన తాళ్లూరు వెంకటేశ్వర్లు(44) శుక్రవారం గేదెలు మేపడానికి వెళ్లాడు. గేదెలు కనిపించకపోవడంతో వాటిని వెతుక్కుంటూ సమీపంలోని పొలాల్లోకి వెళ్లేందుకు ఏరు దాటుతుండగా నీళ్లలో చిక్కుకుని మృతి చెందారు. వెంకటేశ్వర్లు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా ఏటి గట్టున ఉన్న చెప్పులు కనిపించాయి. నీళ్లలో వెతకడంతో మృతదేహం లభ్యమైంది.

శనీశ్వర స్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, మార్చి 2: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వర స్వామికి విశేష పూజలు జరిగాయి. శనివారం పురస్కరించుకుని శనిప్రీతి కోసం విశేషంగా తైలాభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని విశేషాలంకారంతో దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

31లోగా బకాయిలు చెల్లిస్తే వడ్డీ మాఫీ

గూడూరు, మార్చి 2: పట్టణంలో మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఖాళీ స్థలం, ఇంటి పన్నుల బకాయిలను మార్చి 31వ తేదీలోపు చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీమాఫీ చేస్తుందని కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణదారుల ట్రేడ్ లైసెన్స్ ఫీజును మార్చి నెలాఖరులోగా చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.

ఆరు మద్యం బాటిళ్ల స్వాధీనం

బాలాయపల్లి, మార్చి 2: మండలంలోని మేల్చూరు గ్రామంలో ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నాగార్జున అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మహబూబ్ సుబానీ తెలిపారు.

రావిగుంటపాళెం సర్పంచు మృతి



సురేంద్రరెడ్డి (ఫైల్‌ఫొటో)

వాకాడు, మార్చి 2: వాకాడు మండలంలోని రావిగుంటపాళెం గ్రామ సర్పంచు దేవారెడ్డి సురేంద్రరెడ్డి(55) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. సురేంద్రరెడ్డి మృతిపట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

రెండు లారీల ఢీ

డ్రైవరుకు తీవ్ర గాయాలు

ఓజిలి, మార్చి 2: ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్ రోడ్డుకు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన లారీ డ్రైవరు సూరయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ రవిబాబు కథనం మేరకు... చెన్నై నుంచి ఒంగోలుకు వెళుతున్న లారీ ముందు వెళుతున్న లారీ హఠాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవరు సూరయ్యకు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవిబాబు తెలిపారు.

బైకు బోల్తా: మహిళకు గాయాలు

బాలాయపల్లి, మార్చి 2: మోటారు బైకు బోల్తాపడి ఓ మహిళ గాయాలపాలైన సంఘటన శనివారం బాలాయపల్లి చోటు చేసుకుంది. నెల్లూరుకు చెందిన వల్లూరు కోదండరామయ్య, ఆయన భార్య సుమిత్ర వెంకటగిరిలో బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి నెల్లూరు వెళుతుండగా బాలాయపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న స్పీడు బ్రేకరు కనిపించక పోవడంతో అదుపుతప్పి బైకు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సుమిత్రకు తీవ్ర గాయాలవడంతో 108 వాహనంలో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన చంద్రబాబుతో టీడీపీ ముఖ్య నాయకులు- సభలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

వీపీఆర్ వర్గం చేరికతో టీడీపీలో జోష్

నెల్లూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి/సిటీ): ఓ వైపు తెలుగుదేశం పార్టీ శ్రేణులు, మరోవైపు మిత్రపక్షం జనసేన సైనికులు.. ఇంకోవైపు వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు తరలివచ్చిన నాయకులు, వారి అనుచరులతో శనివారం నెల్లూరులోని గొలగమూడి ప్రాంతం పోటెత్తిపోయింది. వేలాదిగా తరలివచ్చిన ప్రజలతో వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్ కిటకిటలాడింది. కొత్త నాయకుల చేరికలు, పాత కార్యకర్తల కేరింతల నడుమ టీడీపీ అధినేత చంద్రబాబు ఉత్సాహంగా కనిపించారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతుల వ్యక్తిత్వాన్ని ప్రశంసించారు. ఇప్పటికే ముగ్గురు నాయకులు ఆనం, శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి చేరికతో బలంగా ఉన్న నెల్లూరులో చివరి బ్రహ్మాస్త్రంలా వీపీఆర్, ఆయన వర్గీయుల చేరికతో ఇక తిరుగుండదన్నారు. తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఐదు ఎన్నికలకు అభ్యర్థులను ఎంపిక చేశానన్నారు. ఏ ఎన్నికల్లో లేనివిధంగా ఈసారి అన్ని కోణాల్లో ఆలోచించి కట్టుదిట్టంగా అభ్యర్థులను ఎంపిక చేశానని చెప్పారు. చివరికి వీపీఆర్‌ను పార్టీలో తీసుకోవడానికి ముందు ఆయన గురించి ప్రజాభిప్రాయం తెలుసుకున్నానని అన్నారు. ఆయన డబ్బు కోసం రాజకీయాల్లో రాలేదు.. సేవ కోసం వచ్చారనే అభిప్రాయమే వ్యక్తమయ్యిందన్నారు. తెలుగుదేశం వీపీఆర్‌ను నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించడానికి ముందే వైసీపీ తన అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని ప్రకటించిందన్నారు. విశాఖను దోచుకుతిన్న విజయసాయిని ఇప్పుడు నెల్లూరు మీదకు పంపారన్నారు. అవినీతిపరుడైన విజయసాయి చివరి వరకు అభ్యర్థిగా ఉంటారో లేదో తెలియదని, ఒకవేళ ఉంటే చిత్తుచిత్తుగా ఓడించాలని చంద్రబాబు ప్రజలను కోరారు. 'నెల్లూరు జిల్లాలో తెలుగుదేశం బలంగా ఉంది. దానికి తోడు ఇటీవల వైసీపీ నుంచి కోటంరెడ్డి శ్రీధర్, ఆనం రామనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి చేరడంతో ఇంకా బలపడింది. చివరి అస్త్రంగా వీపీఆర్ చేరారు. నెల్లూరు జిల్లాలో ఇక పార్టీకి తిరుగు లేదు' అని చంద్రబాబు అన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని 11కు 11 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలను సునాయాసంగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు రాజకీయ చైతన్యం కలిగిన జిల్లా అని, ఇక్కడ జరిగే రాజకీయ పరిణామాలు రాష్ట్ర భవిష్యత్ పరిణామాలను తెలియజేస్తాయన్నారు. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ దేవుని కృపతో సాధ్యమైన మేర ప్రజలకు సేవ చేస్తున్నానని, మరింత ఎక్కువగా సేవ చేయాలంటే రాజకీయాల్లోకి రావాలని కొంత మంది చేసిన సూచనల మేరకు రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఇప్పుడు టీడీపీ అభ్యర్థిగా నెల్లూరు పార్లమెంట్‌కు పోటీ చేస్తున్నా. అందరూ మద్దతు ఇచ్చి గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల ద్వారా పేదల ఆకలి తీర్చిన వ్యక్తి చంద్రబాబయితే పళ్లెంలో అన్నం లాక్కున్న వ్యక్తి జగన్ అన్నారు. ఏపీలో జగన్ అధికారంలోకి వచ్చాక హత్యా రాజకీయాలు పెరిగిపోయాయని, అతని చిన్నాన్నను హత్య చేసిన వ్యక్తికి సహకరించే సీఎం మనకు అవసరం లేదన్నారు.

ఊరూరా చీలనున్న వైసీపీ ఓటు బ్యాంకు

వీపీఆర్‌తో పాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వందలాది మంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. ఇటు కందుకూరు నుంచి అటు సూళ్లూరుపేట వరకు మున్సిపాలిటీలు, మండల, పంచాయతీల స్థాయిలో ప్రజలను ప్రభావితం చేయగలిగిన వారంతా సైకిల్ ఎక్కారు. వీరి చేరికతో టీడీపీకి రెండు రకాల ప్రయోజనాలు కలగనున్నాయి. టీడీపీ ఖాతాలోకి అదనపు ఓట్లు జమ కావడంతో పాటు ఇప్పటివరకు నాయకత్వమే లేని గ్రామాలు, పట్టణాల్లో టీడీపీకి పట్టు దొరికినట్లయింది. దాదాపుగా అన్ని మండలాల నుంచి వైసీపీ నాయకులు వలసొచ్చి టీడీపీలో చేరడంతో ఊరూరా వైసీపీ ఓటు బ్యాంకులో చీలిక అనివార్యంగా కనిపిస్తోంది.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కట్టా రమణారెడ్డి, సన్మానిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, పేరం మధుసూదన్ నాయుడుకు కండువా కప్పుతున్న చంద్రబాబు

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



మృతుడు వెంకటసుబ్బయ్య

వరదయ్యపాళెం, మార్చి 2: వరదయ్యపాళెం మండలంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒక వృద్ధుడు మరణించాడు. తొట్టంబేడు మండలం పొయ్యకొత్తూరుకు చెందిన గొర్రిపాటి వెంకటసుబ్బయ్య (75), ఆయన కుమారుడు మురళి, కుమార్తె సుభాషిణితో కలిసి ద్విచక్ర వాహనంపై శనివారం సూళ్లూరుపేటలోని బంధువుల ఇంటికి బయలుదేరారు. సంత వేలూరు పంచాయతీ సాధనపాళెం పరిసర ప్రాంతంలో బీఎన్‌కండ్రిగ -సూళ్లూరు ప్రధాన రహదారిపై వెళతుండగా చెన్నైకి చెందిన యువకులు తలకోనకు వెళే క్రమంలో అతివేగంగా వీరి వాహనాన్ని ఢీకొన్నారు. గాయ పడిన వీరిని చికిత్స నిమిత్తం 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలిం చారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో వెంకట సుబ్బయ్య మరణించాడు. చెన్నైకి చెందిన యువకుల్లో ఓ యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. వరదయ్యపాళెం ఏఎస్ఐ షణ్ముగం కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

వరదయ్యపాళెం, మార్చి 2: వరదయ్యపాళెంలోని గోవర్ధన పురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డైనమిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. చెన్నైకు చెందిన శంకర నేత్రాలయ వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని తెలియజేశారు. ఆపరేషన్లకు ఎంపికైన వారికి చెన్నైలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించి వారికి, సహాయకులకు రవాణా, భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు.

భయభ్రాంతులకు గురిచేస్తున్నారు

శ్రీకాళహస్తి, మార్చి 2: కొందరు పోలీసు అధికారులు బైండోవర్ కేసులు, రౌడీ షీట్లు నమోదు చేస్తామని జనసేన నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శ్రీకాళహస్తి డీఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డిని కలిసి శనివారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆమెవెంట చంద్రబాబు తదితరులు ఉన్నారు.

ఫ్లోర్ క్లీనింగ్ యంత్రం వితరణ



యంత్రాన్ని అందుకుంటున్న ఈవో నాగేశ్వరరావు

శ్రీకాళహస్తి, మార్చి 2: ముక్కంటి ఆలయానికి నాయుడుపేటకు చెందిన గ్రీన్ ప్యానెల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ నిర్వాహకులు ఫ్లోర్ క్లీనింగ్ యంత్రాన్ని వితరణ చేశారు. ఆలయ పరిపాలనా భవనంలో శనివారం కంపెనీ నిర్వాహకులు ఈవో నాగేశ్వరరావుకు అందజేశారు. అధికారులు యంత్రానికి పూజలు చేసి ప్రారంభించారు.

ఈ-క్రాప్ నమోదుపై గ్రామసభ

వరదయ్యపాళెం, మార్చి 1: వరదయ్యపాళెం మండలంలోని కడూరు, మరదవాడ పంచాయతీల్లో శనివారం 2023-24 రబీ సీజన్‌కు సంబంధించి సాగు, ఈ-క్రాప్ నమోదుపై గ్రామసభ నిర్వహించారు. వ్యవసాయశాఖ సిబ్బంది ఈ-క్రాప్ వివరాలను చదివి వినిపించారు. అభ్యంతరాలు ఉంటే సవరణ కోసం రైతు భరోసా కేంద్రంలో వీఏఏ, వీహెచ్‌ఏ, వీఎస్‌ఏలను సంప్రదించి రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. ఇదేచివరి అవ కాశమని అనంతరం ఎలాంటి మార్పులు చేర్పులు ఉండబోవని స్పష్టం చేశారు.

పోలియో మహమ్మారిని తరిమికొడదాం



అంబేడ్కర్ కూడలి వద్ద మానవహారం నిర్వహిస్తున్న వైద్యబృందం

శ్రీకాళహస్తి/ రేణిగుంట/ ఏర్పేడు/ బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 2:పోలియో మహమ్మారిని తరిమి కొడదామని విద్యార్థులు పిలుపునిచ్చారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శ్రీకాళహస్తి పట్టణ ఇంచార్జి రమేష్ బాబు ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని బాబు అగ్రహారం పురపాలక సంఘ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ యూత్ చైర్మన్ షేక్ అజారుద్దీన్, అసిస్టెంట్ గైడ్ కమిషనర్ చింతపూడి పార్వతి స్కౌట్ మాస్టర్ యోగానంద, ధనుష్ పాల్గొన్నారు. ● డాక్టర్ ఛత్రప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో రేణిగుంట పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఆదివారం ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కోరారు. అలాగే వెదుళ్లచెరువు ఎస్టీకాలనీలో ఆషా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో పోలియో చుక్కలపై అవగాహన కల్పించారు. ఆ సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు, ఉపాధ్యాయులు గిరిరెడ్డి, చంద్రశేఖర్, చంద్రవర్ధిని పాల్గొన్నారు. ● ఏర్పేడు మండలంలోని ఎండీపుత్తూరు గ్రామంలో సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ● బుచ్చినాయుడుకండ్రిగలో వైద్యాధికారి దివాకర్ ఆధ్వర్యంలో పల్స్ పోలియోపై ఆటోలో ప్రచారం చేశారు,

చదువుపై దృష్టి కేంద్రీకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు అర్బన్, మార్చి 2: విద్యార్థులు చదువుపై దృష్టిసారించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర సూచించారు. శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని గేటుపుత్తూరు జడ్పీహెచ్‌ఎస్‌లో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో బాల్యం అత్యంత విలువైనదని, ఈ సమయాన్ని చదువుపై శ్రద్ధ చూపించాలని హితవు పలికారు. అలాగే మత్తుపదార్థాల జోలికి వెళ్లవద్దని, జీవితాన్ని పాడుచేసుకోవద్దని చెప్పారు. చిన్నారులు ఇళ్లలో వండిన ఆహారాన్నే తీసుకోవాలని, బయట పదార్థాల్లో నాణ్యత ఉండకపోతే అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఒంటరిగా బయటకు వెళ్లవద్దని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చిన్నారుల సంరక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంఈవో బాలసుబ్రమణ్యం, ఎస్ఐ వెంకటమోహన్, హెచ్‌ఎం కేజే.వేములు, పీఈటీ జయదేవ్ పాల్గొన్నారు.

గ్రామస్థాయి పాలనే ప్రభుత్వ ధ్యేయం



అప్పలాయగుంటలో సచివాలయ భవనం ప్రారంభిస్తున్న మంత్రి రోజా

వడమాలపేట, ఫిబ్రవరి 2: గ్రామస్థాయి పరిపాలనే ధ్యేయంగా ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించినట్లు మంత్రి రోజా చెప్పారు. శనివారం మండలంలోని అప్పలాయగుంట, పత్తిపుత్తూరులో సచివాయలం, రైతు భరోసా కేంద్రం, బల్క్ మిల్క్ కేంద్రం భవనాలను మంత్రి ప్రారంభించారు. కాగా, ఇవే భవనాలను గత నెల 25న జడ్పీటీసీ మురళీధర్ రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే.

పుత్తూరు వార్తలు

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో శ్రీనివాసుడు

వడమాల పేట, మార్చి 2: అప్పలాయగుంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారిని సర్వాభరణాలు, పూల మాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు, భక్తులు గోవిందనామ స్మరణల నడుమ శ్రీవారి ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారికి మంగళహారుతలిచ్చారు.

వినికిడి సమస్యలపై ఉచిత పరీక్షలు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 2: ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 3, 4, 5 తేదీల్లో తిరుపతిలోని స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్‌లో వినికిడి సమస్యలపై ఉచిత పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ గోపినాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినికిడి సమస్యలున్న వారిని గుర్తించి, తక్కువ ఖర్చుతో యంత్రాలు ఇస్తామని, పాతవి ఎక్స్చేంజ్ చేసుకుంటామని వివరించారు. పూర్తి వివరాలకు 9849085342 నంబర్‌కు సంప్రదించగలరని ఆయన తెలిపారు.

వైసీపీ విముక్త నగరి కోసం ఏకం కండి: భానుప్రకాష్



ఇంటింటి ప్రచారంలో స్థానికులతో భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, మార్చి 2: నగరి నియోజకవర్గాన్ని వైసీపీ కబంధ హస్తాల నుంచి విముక్తి చేసేందుకు ప్రజలందరూ ఏకం కావాలని నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు విద్యానగర్ కాలనీ, బత్తలవారి కండ్రిగ, వీరప్పరెడ్డిపాళ్యంలో మీతో మీ తెలుగుదేశం, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి నియోజకవర్గం నుంచి రెండుసార్లు వైసీపీకి ఓటేసి గెలిపిస్తే ఒక్కటైనా చెప్పుకోదగ్గ అభివృద్ధి జరిగిందా అని నిలదీశారు. డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లకు శిలాఫలకాలు వేసుకుని అభివృద్ధి అంటూ వైసీపీ నాయకులు జబ్బలు చరుచుకుంటూ శునకానందం పొందుతున్నారని ఎద్దేవా చేశారు. పక్కనే ఉన్న డిగ్రీ కళాశాల ముద్దుకృష్ణమనాయుడు తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను తీసుకువచ్చి ప్రారంభోత్సవం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పుత్తూరులో బాలికల జూనియర్ కళాశాల, ఆర్టీసీ డిపో, ఫైర్ స్టేషన్, అటవీశాఖ, పంచాయతీరాజ్ ఉన్నతాధికారుల కార్యాలయాలు ముద్దుకృష్ణమ హయాంలో వచ్చినవేనని స్పష్టం చేశారు. ముద్దుకృష్ణమనాయుడు కఠినంగా వ్యవహరించడంతోనే పుత్తూరులో ప్రశాంత వాతావరణం నెలకొన్నట్లు వివరించారు. ఈ ఐదేళ్లలో పోలీసు వ్యవస్థను వైసీపీ నాయకులు నిర్వీర్యం చేశారని, బాధితులపైనే కేసులు పెట్టడం, ప్రశ్నిస్తే కేసులు పెట్టడం రివాజుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుత్తూరుతో పాటు నగరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదని తేల్చి చెప్పారు. రానున్నది టీడీపీ, జనసేన సంయుక్త ప్రభుత్వమని, ఇంతకు రెండింతలు సంక్షేమం అందించడంతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని హామీ ఇచ్చారు. పెద్ద ఎత్తున పరిశ్రమల స్థాపనకు ఊతమిస్తామని యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనకు కట్టుబడి ఉన్నామని భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి, చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్‌కు మద్దతుగా నిలిచి సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా స్థానికులు గాలి భానుప్రకాష్‌కు అఖండ స్వాగతం పలికారు. ఇంటింటి వద్ద పూలదండలు, దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు బి.ధనంజయులు నాయుడు, పురుషోత్తం నాయుడు, గోవర్ధన్, బాబునాయుడు, ఆనంద్, శ్రీనివాసులనాయుడు, శేఖర్‌నాయుడు, వినయ్‌బాబు, హరీష్, ప్రసాద్, బాబూరావు, మహేష్, రూపేష్‌కుమార్, మురళీకృష్ణ, వాసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

85ఏళ్లు పైబడిన వారికి హోమ్ ఓటింగ్: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 2: 85 ఏళ్ల దాటి పోలింగ్ కేంద్రాలకు రాలేని వారికి హోమ్ ఓటింగ్‌కు అవకాశం ఉంటుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. శనివారం వివిధ పార్టీల నేతలతో సమావేశమైన ఆయన పలు అంశాలపై చర్చించారు. 2024 ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ వేసే ముందు రోజు ప్రత్యేక బ్యాంకు ఖాతా, చెక్‌బుక్ కలిగి ఉండాలన్నారు. జిల్లాలో 61 పోలింగ్ స్థానాల మార్పునకు, 80 పోలింగ్ కేంద్రాల పేరు మార్పు, ఆరు ఆగ్జిలరీ పోలింగ్ కేంద్రాల ఆమోదం కోసం చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి కార్యాలయానికి పంపించినట్లు తెలిపారు. ఈఎస్‌ఎంఎస్, సి-విజిల్, ఈవీఎం వాడకంపై నోడల్ అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన అంశాలను పరిశీలించి, నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో పెంచలకిషోర్, ఈఆర్‌వోలు అదితి సింగ్, కిరణ్‌కుమార్, రవిశంకర్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి, చంద్రముని, కోదండరామిరెడ్డి, అదనపు ఎస్పీ రాజేంద్ర, ట్రైనింగ్ నోడల్ అధికారి రామ్మోహన్, ఎన్ఐసీ అదనపు డీఐవో వెంకటేశ్వరరావు, ఎస్డీసీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సివిజిల్ నోడల్ అధికారి ప్రసాదరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.86 కోట్లు

తిరుమల, మార్చి 2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.86 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది.

శ్రీకాళహస్తి
సత్యవేడు

రోడ్డు ప్రమాదంలో యూపీ వాసి మృతి

రేణిగుంట, మార్చి2: రేణిగుంట శ్రీకాళహస్తి జాతీయ రహదారిలో శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి (35)మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు వ్యక్తి వెదుళ్లచెరువు బస్టాప్ సమీపంలో రోడ్డు దాటుతుండగా శ్రీకాళహస్తి వైపు నుంచి రేణిగుంట వైపునకు వస్తున్న లారీ ఢీకొంది. దీంతో అతడు అక్కడి కక్కడే మృతిచెందాడు. అతడి వద్దనున్న సెల్‌ఫోన్ ద్వారా ఉత్తర్‌ప్రదేశ్ వాసిగా గుర్తించారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందిం చారు. మృతదేహాన్ని స్వాధీనం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ పరీక్షలు ప్రారంభం


పరీక్షలకు హాజరైన విద్యార్థులు

సత్యవేడు, మార్చి 2: సత్యవేడులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభ మయ్యాయి. తొలిరోజు తెలుగు, తమిళం, హిందీ, సంస్కృతం పరీక్షలు జరిగాయి. పరీక్షల చీఫ్, ప్రిన్సిపాల్ జగన్మోహ నాచారి, డిపార్ట్‌మెంట్ అధికారి జాకీర్ హుస్సేన్ పర్యవేక్షణలో ఇంటర్ పరీక్షలు కొనసాగాయి. కాగా 305 మందికి గాను 295 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మిగిలిన 10 మంది గైర్హాజరయ్యారు. పరీక్షకేంద్రాన్ని ఎస్ఐ వీరాంజనేయులు తనిఖీ చేశారు.

సాగుభూములకు పట్టాలివ్వండి : సీపీఐ

తొట్టంబేడు, మార్చి2: శ్రీకాళహస్తి మండలంలోని వాగివేడు రెవిన్యూ సర్వే నెం 1-1లో దళితులు సాగు చేసుకుంటున్న సుమారు 16 ఎకరాల ప్రభుత్వ భూమిని వారికే పట్టాలు ఇవ్వాలని సీపీఐ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

సత్యవేడు, మార్చి 2: చెరివి పంచాయతీ పరిధిలో వివిధ పద్దుల కింద మంజూరైన నిధుల వ్యయంలో అవకతవకలు జరిగాయని ఫిర్యాదులు రావడంతో శనివారం పంచాయతీ కార్యాలయంలో సూళ్లూరుపేట డీఎల్‌పీవో రవీంద్రబాబు విచారణ చేపట్టారు. అయితే రికార్డులు లేవని, తాను కొత్తగా బాధ్యతలు స్వీకరించానని కార్యదర్శి ప్రకాష్ చెప్పినట్లు సమాచారం. ఆడిట్‌కు రికార్డులు ఇచ్చామని గడువు ఇస్తే అన్ని తెలియజేస్తానని తెలిసింది. కాగా డాక్టర్ విజయకుమార్ సమాచార హక్కు చట్టం కింద నిధుల వివరాలు, చేపట్టిన పనులు వివరాలపై సమాచారం కోరారు. ఆ మేరకు విచారించాలని జిల్లా అధికారులకు ఇటీవల ఆయన ఫిర్యాదు చేశారు. దీంతో డీఎల్‌పీవో విచారణ చేపట్టారు.

దివ్యాంగులకు ఇతర రాష్ట్రాల బస్సుల్లో రాయితీ ఇవ్వండి


సమావేశంలో మాట్లాడుతున్న మిద్దెల హరి

శ్రీకాళహస్తి, మార్చి 2: ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఇతర రాష్ట్రాల్లో ప్రయాణించే సమయంలోనూ దివ్యాంగులకు 50 శాతం రాయితీ అమలు చేయాలని ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి ఆదేశించారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా ప్రయాణించే దివ్యాంగులకు 50 శాతం రాయితీ ఇచ్చేలా సీఎం జగన్ గతంలోనే ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. అయితే ప్రస్తుతం అది అమలుకు నోచుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లో అమలయ్యేలా ఉత్తర్వులు జారీ చేయాలని అన్ని జిల్లాల ప్రజా రవాణా శాఖ అధికారులకు లేఖ రాశానని తెలియజేశారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కేవీబీపురం, మార్చి2: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్య సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి వెల్లడించారు. ఏప్రిల్ 24న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు మార్చి 31లోపు ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విద్యార్థులు 01-09-2012 నుంచి 31-08-2014 సంవత్సరాల మధ్య పుట్టిన వారై ఉండాలని తెలియజేశారు. ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 రుసుము చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడి అరెస్టు

కేవీబీపురం, మార్చి2: మండలంలోని ఓ బాలికపై గురువారం అత్యాచారయత్నం చేసిన జగదీష్(28)ని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

మద్యం స్వాధీనం.. ఒకరి అరెస్టు

కేవీబీపురం, మార్చి2: మండలంలోని వగత్తూరు గ్రామానికి చెందిన శేఖర్‌బాబు(48) అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్ఐ సునీల్ కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

ముమ్మరంగా స్మశాన వాటిక పనులు

ఏర్పేడు, మార్చి 2: ఏర్పేడులోని గాండ్లవీధి శ్మశాన వాటికశుభ్రం చేసే పనులను సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్లపాళెం శివయ్య శనివారం చేపట్టారు. ఎక్స్‌కవేటర్ సాయంతో ముళ్లపొదలు తొలగించి శుభ్రం చేయించారు.

గిరిజనుల దాహార్తిని తీర్చిన సుధీర్‌రెడ్డి

ఏర్పేడు, మార్చి 2: ఏర్పేడు మండలం చింతపాళెం పంచాయతీ వెంకటాపాళెం గిరిజనకాలనీ వాసులు కొద్దిరోజులుగా తాగునీటి కోసం అవస్థల పడుతున్నారు. కాలనీలోని బోరులో ఉప్పునీరు వస్తుండటంతో సమస్యను బొజ్జల సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన తన సొంత నిధులతో కాలనీలో తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. శనివారం బొజ్జల బృందమ్మ కొబ్బరికాయ కొట్టి బోరును ఏర్పాటును ప్రారంభించారు.

ఇంటి పట్టాల పంపిణీ

ఏర్పేడు, మార్చి 2: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఏర్పేడు సర్పంచ్ శివయ్య అన్నారు. ఏర్పేడు మండల కేంద్రంలోని సచివాలయంలో 83మంది పేదలకు ఇంటి హక్కు పత్రాలు రిజిస్ట్రేషన్ చేయించి అందజేశారు. ఈకార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

స్టార్ కృష్ణను కలిసి జూపూడి

ఏర్పేడు, మార్చి 2: రేణిగుంట మండలం జీపాళెం గ్రామం స్టార్‌కృష్ణనగర్‌లో ఉంటున్న అంబేడ్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంబేడ్కర్ స్టార్ కృష్ణను శనివారం రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు కలిశారు. గాలి రవి, గాలి సుధాకర్, వాసుదేవ, వెంకటేష్, శంకరయ్య, చలపతి, శ్రీనివాసులు, రాజశేఖర్, బిట్టు, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ చెంచయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.




ముక్కంటి బ్రహ్మోత్సాల సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత తోరణం, అలంకరణకు సిద్ధం చేస్తున్న పుష్పాలు, మండపంలో అలంకరణ

ఆలయానికి చేరిన ఆభరణాలు


ఆభరణాలు సరిచూస్తున్న ఈవో నాగేశ్వరరావు, అధికారులు

శ్రీకాళహస్తి, మార్చి 2: మహా శివరాత్రి ఉత్స వాలను పురస్కరించుకుని బ్యాంకు లాకర్లో ఉన్న జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహ స్తీశ్వరుని ఆభరణాలను శనివారం ముక్కంటి ఆలయానికి చేర్చారు. 14రోజులు పాటు జరిగే శివరాత్రి ఉత్సవాల్లో స్వామి, అమ్మవార్లు ఆభరణాలను ధరించి సర్వాలంకార భూషితమై భక్తులకు దర్శనమిస్తారు. ఇందులో గండబేరుండ హారం, కిరీటాలు, పాదాలు, గౌరీ శంకరుల రుద్రాక్ష మాలలు, రావి ఆకు పతకము, చంద్ర పతకం, బిల్వ దళమాల, కర్ణ పత్రాలు, యజ్ఞోపవీతం, స్వర్ణ చిలుక, పార్వేట పతకం, నవరత్న మాల, పగడమాల, కాసులపేరు, హారాలు ఉన్నాయి. ఈ కార్యక్ర మంలో ఈవో నాగేశ్వరరావు, అధికారులు అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేత వీరంగం

బోరు లారీ అద్దాల ధ్వంసం

శ్రీకాళహస్తి, మార్చి 2: తన ద్విచక్ర వాహనానికి బోరు లారీ సైడ్ ఇవ్వలేదని ఓ వెసీపీ నేత నడిరోడ్డుపై వీరంగం సృష్టిం చాడు. యజమాని, డ్రైవర్‌గా ఉన్న వ్యక్తిపై దాడి చేయడమే కాకుండా లారీ ముందు భాగంలో ఉన్న రెండు అద్దాలను రాళ్లతో ధ్వంసం చేశారు. ఈ ఘటన శ్రీకాళహస్తిలోని ఎన్టీఆర్ పార్క్ వద్ద శనివారం చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు... శ్రీకాళహస్తి మండలం రేపల్లెకు చెందిన కంచి కంద కుమార్ అనే యువ కుడు శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు ఎదురుగా నివసిస్తుం టాడు. సొంతంగా బోర్ వెల్స్ నడుపుతుం టాడు. శనివారం ఎన్టీఆర్ పార్క్ సమీపంలోని రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో బోరు వేసేందుకు కందకుమార్ వాహనంతో బయలుదేరాడు. ఎన్టీఆర్ పార్కు వద్ద రెడ్డి అండ్ రెడ్డి కాలనీకి చేరుకునేందుకు మలుపు తిప్పాడు. అదే సమయంలో వెనకవైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న వైసీపీ నేత బోర్ లారీ నడుపుతున్న వ్యక్తితో పరుషపదజాలంతో దురుసుగా మాట్లాడారు. లారీ దిగిన కందకుమార్ వైసీపీ నేత మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో వైసీపీ నాయకుడు పక్కనే ఉన్న రాళ్లతో లారీ ముందు భాగంలో ఉన్న రెండు అద్దాలను పగలగొట్టడంతో పాటు తనపై చేయిచేసుకున్నాడని కందకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా బోరు లారీ యజమాని కంద కుమార్ సోదరుడు వైసీపీలో యాక్టివ్‌గా కొనసాగుతున్నారు. పోలీసులు లారీ అద్దాల ధ్వంసం ఘటనను బయటకు పొక్కకుండా లారీని ఘటనా స్థలం నుంచి తొలగించారు. పగిలిన అద్దాలను ఫొటోలు తీసినా అవి బయటకు వెళ్లకుండా చూ శారు. ఇరువర్గాల మధ్య రాజీ చేయాలని ముమ్మర ప్రయత్నాలు సాగించారు. అయితే కందకుమార్ అంగీకరించక పోవడంతో కేసు నమోదుకు ప్రొసీడింగ్స్ సిద్ధం చేసినట్లు సమాచారం.

ముక్కంటి బ్రహ్మోత్సవాల్లో నేడు...

- తెల్లవారుజామున 4:30 గంటలకు: మంగళ వాయిద్యాలు
- ఉదయం 5 గంటలకు: గోపూజ, సుప్రభాతం, సర్వదర్శనం
- 6 గంటలకు ప్రథమ కాలాభిషేకం
- 7 గంటలకు ద్వితీయ కాలాభిషేకం
- 8 గంటలకు: పరివార దేవతలకు నైవేద్యం, నిత్యోత్సవం
- 10 గంటలకు: ఉచ్చికాలాభిషేకం
- మధ్యాహ్నం 3 గంటలకు: కన్నప్ప కొండకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల తరలింపు
- సాయంత్రం 4గంటలకు భక్తకన్నప్ప ధ్వజారోహణం
- 5గంటలకు: ప్రదోష కాలాభిషేకం
- 6 గంటలకు; భక్తకన్నప్ప గ్రామోత్సవం
- 7గంటలకు భక్తకన్నప్ప ఆలయ ప్రవేశం, స్వామి అమ్మవార్లకు ధూపదీప, నైవేద్యం, మంత్రపుష్పం సమర్పణ
- రాత్రి 8గంటలకు: మత్స్యగ్రహణం, అంకురార్పణ, వాస్తు శాంతి
- రాత్రి 9గంటలకు: పళ్లియర పూజ, స్వామి దర్శనం ముగింపు

ఓటు ఉందా లేదా తెలుసుకోండి : సుధీర్


సూపర్ సిక్స్ కిట్లు అందజేస్తున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 2: ఓటు ఉందా లేదా ముందే చూసుకోవాలని టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం పార్టీ కార్యాలయంలో శంఖారావం కార్యక్రమంపై శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, తొట్టంబేడు, ఏర్పేడు మండల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో 45 రోజులు ప్రతీ ఒక్కరూ కష్టపడాలన్నారు. ఏమాత్రం అలసత్వం పనికిరాదని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అరాచకాలను వివరించాలని సూచించారు. పట్టణ అధ్యక్షులు విజయ్‌కుమార్, పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్ పాల్గొన్నారు.

తప్పుడు రౌడీషీట్లపై న్యాయ పోరాటం

టీడీపీ నాయకులు నమోదు చేసిన తప్పుడు రౌడీషీట్లపై న్యాయ పోరాటం చేస్తామని సుధీర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తప్పుడు కేసులపై ఎస్పీ మలికాగర్గ్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఎస్పీ సానుకూలంగా స్పందించారన్నారు. ఇప్పటికైనా కొందరు అధికారులు తమ పద్ధతి మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

చంద్రబాబును కలిసిన గురవారెడ్డి



ఏర్పేడు, మార్చి 2: టీడీపీ అధినేత చంద్రబాబును ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి కలిశారు. నెల్లూరు పర్యటన కోసం నెల్లూరు వద్ద కనపర్తిపాడు హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద ఆయన్ను కలిశారు. తంబళపల్లి నియోకవర్గ పరిశీల కుడుగా ఉన్న గురవారెడ్డి ఆ నియోజకవర్గ పరిస్థితులకు సంబంధించిన నివేదికను చంద్రబాబుకు అందజేశారు. అదేవిధంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఆసరా చెక్కు పంపిణీ

తొట్టంబేడు, మార్చి2: శ్రీకాళహస్తి ఎంపీడీవో కార్యాలయంలో నాలుగో విడత ఆసరా పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి పూజ


విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 2: మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు సరస్వతి పూజను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల నుంచి దీవెనలు తీసుకున్నారు. హెచ్ఎం రూపేష్ కుమార్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, సురేష్‌బాబు, నాదెండ్ల మనోహర్, వేణుగోపాల్, దాసు, మాధవీలత, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సిపాయి భరోసా అందజేత

తొట్టంబేడు, మార్చి2: శ్రీకాళహస్తి మండలంలోని చుక్కలనిడిగల్లు పంచాయతీలోని గిజన కాలనీలో రమేష్, సుహాసిని ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం సిపాయి భరోసా కింద 40 రకాల నిత్యావసర వస్తువులను వారిరువురి కుటుంబాలకు శనివారం అందజేశారు. అనంతరం కాలనీలోని పలువురు వైసీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో రత్నం రెడ్డి, వడ్లతాంగాల్ బాలాజీరెడ్డి, మధురెడ్డి, భరత్‌రెడ్డి, వెంకటాద్రి, భాస్కర్, దాము పాల్గొన్నారు.

రేణిగుంట: మండలంలోని తూకివాకం పంచాయతీ గంగుంటలో అరవ డేవిడ్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం 42 నిత్యావసర వస్తువుల కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబు, ఎంపీటీసీ ఆనందరావు, వార్డు సభ్యులు పళణి, రమణయ్య, సత్తెమ్మలతో పాటు పలువురు పాల్గొన్నారు.

గృహప్రవేశానికి హాజరైన బృందమ్మ

ఏర్పేడు, మార్చి 2: చిందేపల్లెలోని టీడీపీ సీనియర్ నాయకులు గంగల పూడి పార్థసారథిరెడ్డి గృహ ప్రవేశ వేడుకలకు బొజ్జల బృందమ్మ శనివారం హాజరయ్యారు. మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ము స్వాహా మ్యాన్ పవర్ ఏజెన్సీ నిర్వాహకుడి అరెస్టు

శ్రీసిటీ, మార్చి 2: శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు సంబంధించిన పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ము స్వాహా కేసులో ఏజెన్సీ నిర్వాహకుడిని శ్రీసిటీ పోలీసులు అరెస్టు చేశారు. శ్రీసిటీ సీఐ భాస్కర్ కథనం మేరకు.. శ్రీసిటీ పరిధిలో ఆరూరు సమీపంలో డైకి అల్యూమినియం కంపెనీ ఉంది. చెరివిలో కొనసాగుతున్న ఎంఎంఎస్ మ్యాన్ పవర్ ఏజెన్సీ నుంచి డైకి కంపెనీ యాజమాన్యం పలువురు కార్మికులను కాంట్రాక్టు పద్ధతిపై తీసుకుంది. వేతనాలను కంపెనీ యాజమాన్యం మ్యాన్ పవర్ ఏజెన్సీ ద్వారా చెల్లిస్తోంది. ఇందులో కార్మికుల వేతనం నుంచి మ్యాన్ పవర్ ఏజెన్సీ నిర్వాహకులు కొంత సొమ్మును పీఎఫ్, ఈఎస్ఐకి చెల్లించాల్సి ఉంది. కానీ ఏజెన్సీ నిర్వాహకుడు ప్రసాద్ పీఎఫ్, ఈఎస్ఐకి నగదు జమ చేయలేదు. ఈ విషయాన్ని కార్మికులు డైకి కంపెనీ హెచ్ఆర్ ఖాజారఫీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన గత నెల 22 తేదీ శ్రీసిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శ్రీసిటీ సీఐ భాస్కర్ దర్యాప్తు ప్రారంభించారు. ఒక ఏడాది పాటు కార్మికులకు సంబంధించిన పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ము రూ.35 లక్షల వరకు సంబంధిత మ్యాన్ పవర్ ఏజెన్సీ నిర్వాహకుడు ప్రసాద్ స్వాహా చేసినట్లు విచారణలో తేలింది. దీంతో ప్రసాద్‌ని శుక్రవారం రాత్రి అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి అతడికి రిమాండ్ విధించారు. కాగా శ్రీసిటీలో దాదాపు 200కుపైనే వివిధ పరిశ్రమలు నడుస్తున్నాయి. ఇక్కడ పలు మ్యాన్ పవర్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటిపైనా అధికారులు నిఘా పెట్టాల్సిన అవసరం ఉందని కార్మికులు కోరుతున్నారు.

జాబ్ కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించండి


పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 2: జాబ్ కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పల్లమాల పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు జరిగే చోట కూలీలకు తాగునీరు, నీడ కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయనవెంట ఏపీఎం భానుప్రియ ఉన్నారు.

'వైసీపీ.. ఇదేం పద్ధతి?'

- బోరు ఏర్పాటును అడ్డుకున్న అధికారులు
- ఎమ్మెల్యే తీరుపై బృందమ్మ ఆవేదన


పొలాల్లో నడిచి వెళుతున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి, మార్చి 2: అమ్మ పెట్టదు.. అడుక్కుతిననీయదు.. అన్న సామెతలా తయారైంది వైసీపీ నాయకుల తీరు.. వాళ్లు చేయరు.. చేసేవారిని చేయనీరు.. తాగే నీటి కోసం అష్టకష్టాలు పడుతున్నామని ఆదుకోవాలని శ్రీకాళహస్తి మండలం వేడాం బైరవ ఎస్టీ కాలనీ వాసులు అధికారుల చుట్టూ తిరిగి తిరిగి విసిగి వేశారిపోయారు. చేసేది లేక టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డిని ఆశ్రయించారు. స్పందించిన ఆయన బోరు వేయిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు బొజ్జల బృందమ్మ శనివారం కాలనీలో బోరు నిర్మాణానికి భూమి పూజ చేశారు. బోరు ఏర్పాటు చేస్తుండగా ముక్కంటి ఆలయ అధికారులు, స్థానిక అధికారులు వచ్చారు. బోరు వేయరాదని అడ్డుకున్నారు. తాము తమ సొంత నిధులతో బోరు వేస్తున్నామని అడ్డుకో వడం మంచిది కాదని ఆమె తెలియజేసినా వారు ఒప్పుకోలేదు. ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకున్న తర్వాతే వేసుకోవాలని చెప్పడంతో ఆమె వెనుదిరిగారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కరించడంలో ఎమ్మెల్యే, అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. ప్రజలకు మంచి చేస్తుంటే అడ్డుకోవడం మంచిది కాదని హితవు పలికారు.

అభివృద్ధికే మొదటి ఓటు వేయండి : టీడీపీ

- 'మై ఫస్ట్ ఓట్‌ఫర్ సీబీఎన్'లో హెలెన్


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సత్యవేడు, మార్చి 2: రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మొదటి ఓటు టీడీపీకి వేయాలని సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి హెలెన్ కోరారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే హేమలత అధ్యక్షతన 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా ఓటు నమోదు చేయించుకున్న యువతతో సమావేశం నిర్వ హించి ఓటు ప్రాముఖ్యతను వారికి వివరించారు. ఈ సందర్భంగా హెలెన్ మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు అధికారం చేపట్టగానే 25 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామ న్నారు. స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు రవినాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. తెలుగు యువత తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు కృష్ణయాదవ్ మాట్లాడుతూ మద్యపాన నిషేధంపై జగన్ మాట మార్చారని తెలియజేశారు. డీఎస్సీ దగా డీఎస్సీగా మారిందన్నారు. అనంతరం ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మీపతిరాజు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పృథ్వీరాజ్, క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్ నాయుడు, నాయకులు తులసి, గోవింద చౌదరి, సంతోష్‌కుమార్, ప్రేమ్‌కుమార్, హరినాయుడు, లీలాకుమార్, మల్లికార్జున్‌నాయుడు, మహిళా అధ్యక్షులు లత, మంజుల, తదితరులు పాల్గొన్నారు.